పర్యవేక్షిస్తున్న జిల్లా కలెక్టర్

భూమి పంచి ఉపాధి కల్పించాలి

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-కోడుమూరు

పేదలకు భూములు పంచాలని, కూలీలందరికీ ఉపాధి కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మహాసభలలో పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం కర్నూలు జిల్లా 12వ మహాసభలు కోడుమూరు జిల్లా అధ్యక్షుడు కె.లింగన్న అధ్యక్షతన జరిగాయి. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మోడీ ఉపాధిహామికి తూట్లు పొడుస్తున్నాడన్నారు. జగన్ నవరత్నాలలో భూ పంపిణీ అనే పథకం ఎందుకు చేర్చలేదని ప్రశ్నించారు. భూమి లేని పేదలకు భూమి పంచాలని పోరాటాలకు సిద్ధం కావాలని సూచించారు.

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నబీ రసూల్ మాట్లాడుతూకేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ, కార్మికుల కడుపు కొడుతూ, రైతులను, కూలీలను విస్మరించాయన్నారు. భవిష్యత్తులో ఉమ్మడి కార్మిక సంఘాల ఆధ్వర్యంలో,మరిన్ని ఉద్యమాలకు సిద్ధం కావాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కె వి నారాయణ గత కార్యక్రమాల నివేదికను

మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. వెంటకటేశ్వరులు

మాట్లాడుతున్న వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి వి నారాయణ

ప్రవేశపెట్టారు. సభ్యులు చర్చించి ఆమోదం తెలిపారు. వ్యవసాయ కార్మికులకు సంక్షేమ బోర్డ్ ఏర్పాటు చేయాలని , ఉపాధి హామీ పథకంలో 200 రోజులు పనిదినాలు కల్పించి రోజుకు రూ.300 వేతనం ఇవ్వాలని, నవరత్నాలలో భూపంపిణీ కార్యక్రమం చేపట్టాలని, తీర్మానాలను జిల్లా ఉపాధ్యక్షుడు బి వీరశేఖర్ ప్రవేశపెట్టిన వెంటనే అందరూ ఆమోదం తెలిపారు. మహాసభలలో జిల్లా నాయకులు తిక్కన్న, బాలకృష్ణ, రామాంజి వెంకరాముడు , తిమ్మన్న నాగన్న, సురేంద్ర, ప్రతినిధులు హాజరయ్యారు. మహాసభలలో నంద్యాల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగేశ్వరరావు, కర్నూలు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు లింగన్న, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు తిక్కన్న, వీరశేఖర్, వెంకట్ రాముడు, నాగన్న, రామాంజనేయులు, బాలకృష్ణ, తిమ్మన్న, సురేంద్ర, కోడుమూరు గూడూరు మండల కార్యదర్శిలు గఫూర్ మియ్య, జె.మోహన్, కోడుమూరు మండల నాయకులు టి.ఈరన్న, శేఖర్, చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మన్న, కె. రాజు, సిఐటియు మండల కార్యదర్శి బాబ్జీ, ఈరన్న, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు గౌస్ దేశాయ్, సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్ రాధాకృష్ణ, కోడుమూరు సీనియర్ నాయకులు కె. నాగిరెడ్డి, యుటిఎఫ్ జిల్లా కౌన్సిలర్ నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్ష

పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో ఎపిపిఎస్‌సి గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా కొనసాగింది. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పరీక్షను అధికార యంత్రాంగం నిర్వహించింది. కర్నూలులో 29 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించారు. ఉదయం , మధ్యాహ్నం రెండు పూటలా ఈ పరీక్ష జరిగింది. ఉదయం నిర్వహించిన పరీక్షకు 9651 మంది అభ్యర్థులకు 6908 మంది పరీక్షకు హాజరు కాగా71.58 శాతం హాజరు నమోదయింది. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 6861 మంది అభ్యర్థులు హాజరు కాగా 71.09 శాతంగా హాజరు నమోదయింది. కర్నూలు నగరంలోని పలు పరీక్ష కేంద్రాల్లో జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు ఆకస్మిక తనిఖీ నిర్వహించి పరీక్షా నిర్వహణపై అక్కడున్న నోడల్ ఆఫీసర్లను అడిగి తెలుసుకున్నారు. కలెక్టరేట్ నుండి పరీక్ష ప్రశ్నాపత్రాలను పరీక్ష కేంద్రాలకు కట్టుదిట్టమైన భద్రత మధ్య తరలించి అనంతరం సాయంత్రం ట్రెజరీలో జవాబు పత్రాలను భద్రపరిచారు. ఈ సందర్భంగా డిఆర్ఒ నాగేశ్వరరావు మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో ఎపిపిఎస్‌సి గ్రూప్ వన్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించామన్నారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా పరీక్షా నిర్వహించామన్నారు. ఇందుకు సహకరించిన అధికార యంత్రాంగానికి , పోలీస్ సిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు.

యుటిఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు, తదితరులు

రేషన్ బియ్యం తరలిస్తే క్రిమినల్ కేసులు

- కార్డుదారులకు ఉచితంగా బియ్యం పంపిణీ
- వినియోగదారుల హక్కుల చట్టంపై అవగాహన
- ప్రజాశక్తితో డిఎస్ఒ రాజా రఘువీర్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

'జిల్లాలో రేషన్ బియ్యాన్ని ఎవరైనా అక్రమంగా తరలిస్తే వారిపై క్రిమినల్ కేసులు పెడతాం. కార్డుదారులు కూడా ఎవరైనా బియ్యం అమ్మితే కూడా చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం జనవరి మాసానికి సంబంధించి కార్డుదారులకు ఉచితంగా ఎండియు వాహనాల్లోనే బియ్యాన్ని పంపిణీ చేస్తున్నాం. జిల్లాలో 1232 రేషన్ షాపులు ఉన్నాయి. మొత్తం 6,50,000 రేషన్ కార్డులున్నాయి. 409 ఎండియు వాహనాలున్నాయి. వినియోగదారులు అన్ని హక్కులను సక్రమంగా పొందేందుకు ఇటీవల అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించాం.' అని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రాజా రఘువీర్ తెలిపారు. ఆయన ప్రజాశక్తి ముఖాముఖిలో మాట్లాడారు.

జిల్లాలో ఎన్ని రేషన్ షాపులు ఉన్నాయి అందులో కార్డులు ఎన్ని ఉన్నాయి?

డిఎస్ఒ: కర్నూలు జిల్లాలో మొత్తం 1232 రేషన్ షాపులు ఉన్నాయి. అందులో 6.59 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. 409 ఎండియు వాహనాల ద్వారా కార్డుదారులకు ప్రతినెలా బియ్యం ఇతర సరుకులను పంపిణీ చేస్తున్నాం. ఎండియు వాహనాల ద్వారానే కార్డుదారులు రేషన్ సరుకులు తీసుకోవాలి.

ఇటీవల జిల్లాలో రేషన్ బియ్యం అక్రమంగా తరులుతుంది? బియ్యం మాఫియాగా మారి పెద్ద ఎత్తున తరలిస్తున్నారు.దీనిపై నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

జవాబు: జిల్లా లో రేషన్ బియ్యం అక్రమంగా తరలించే వారిపై ఉక్కు పాదం మోపుతున్నాం. ఎక్కడైనా రేషన్ బియ్యం అక్రమ నిలువలు ఉంటే వెంటనే దాడులు చేపట్టి సంబంధిత వ్యక్తులపై 6 ఎ కేసులు కూడా నమోదు చేస్తున్నాం. ఎండియు వాహనాల ఆపరేటర్లు కానీ రేషన్ డీలర్లు అక్రమాలకు పాల్పడినట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. కార్డుదారులు కూడా ఎవరైనా రేషన్ బియ్యం అమ్ముతున్నా వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ప్రతి నెల దాడులు నిర్వహించి 6 ఎ కేసులు నమోదు చేసి అక్రమంగా తరలించే వాహనాలను సీజ్ చేస్తున్నాం.

ప్రస్తుతం కార్డుదారులకు ఎన్ని వస్తువులను అందజేస్తున్నారు?

జవాబు: కార్డుదారులకు ప్రతినెల రేషన్ బియ్యంతో పాటు కిలో కందిపప్పు, అరకిలో చక్కెర ఇస్తున్నాం. ప్రస్తుతం వీటిని మాత్రమే కార్డుదారులకు అందజేస్తున్నాం.

రేషన్ కార్డులు పొందెందుకు దరఖాస్తులు చేసుకుంటే ఇస్తారా? జిల్లాకు ఇటీవల ఎన్ని కొత్త రేషన్ కార్డులు వచ్చాయి?

జవాబు: కర్నూలు జిల్లాకు మొత్తం 3858 కొత్త కార్తులు వచ్చాయి. కొత్త కార్డుదారులకు జనవరి మాసానికి సంబంధించిన రేషన్ సరుకులు కూడా ఇవ్వడం జరిగింది. కొత్తగా రేషన్ కార్డులు పొందాలనుకునేవారు సచివాలయంలోకి వెళ్లి దరఖాస్తు చేసుకోవాలి. ఆ దరఖాస్తులకు పరిశీలించి అర్హులను ఎంపిక చేసి తిరిగి జూన్ మాసంలో కొత్త కార్డులను రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వనుంది. కార్డులను పొందెందుకు దరఖాస్తు చేసుకునే ప్రక్రియ నిరంతరం ఉంటుంది.

వినియోగదారుల తమకు ఉన్నటువంటి హక్కులపై అవగాహన లేకపోవడంతో మోసపోతున్నారు? వినియోగదారుల హక్కుల చట్టం అమలుపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు.?

జవాబు: గత డిసెంబర్ నెలలో జాతీయ వినియోగదారుల హక్కుల చట్టంపై విద్యాసంస్థల్లో పలు ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన వక్తృత్వ వంటి పోటీలను నిర్వహించాం. ఈ పోటీలలో రాష్ట్రస్థాయిలో కూడా ఆరుగురు విద్యార్థులు బహుమతులను పొందారు. వినియోగదారుల హక్కుల చట్టం అమలుపై పాఠశాల స్థాయిలోనే క్లబ్‌ను ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నాం. వినియోగదారులు తప్పనిసరిగా ఏ వస్తువు కొనుగోలు చేసిన బిల్లు తీసుకోవాలి. లేకపోతే నష్టపోతారు. వ్యాపారుల మోసాలను కూడా వినియోగదారులు అడ్డుకట్ట వేయొచ్చు.

విద్యుత్ సంస్థను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు ఆపాలి : సిపిఎం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ రంగంలో సంస్కరణల పేరుతో నిర్వీర్యం చేసే ప్రయత్నం మానుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కారణంగా రాష్ట్రాల్లో విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు చేసేలా వత్తిడి చేయడం సమంజసం కాదని అన్నారు. స్మార్ట్ మీటర్ల వల్ల వినియోగదారుడు మీద అదనపు భారం పడడం తప్ప ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. విద్యుత్ పంపిణీ సంస్థలు నష్టాలు వస్తున్నాయని పేరుతో ట్రూ అప్ చార్జీలు అదనంగా వసూలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. మరోవైపు స్మార్ట్ మీటర్ల బిగింపు వల్ల ప్రతి వినియోగదారుడికి రూ.13000 పైగా అదనపు భారం పడబోతుందన్నారు. రానున్న రోజుల్లో విద్యుత్తు అందుబాటులో వున్నప్పటికీ ప్రజలు వినియోగించే స్థితి లేకుండా చేస్తున్నదన్నారు. రాష్ట్రంలో 200 యూనిట్లు దాటిన ప్రతి ఇంటికి స్మార్ట్ మీటర్లను బిగిస్తామని చేసిన నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. డిస్కంల నష్టాలకు వినియోగదారులు బాధ్యులు కాదని, కానీ భారాలు మాత్రం వినియోగదారులు భరిస్తున్నారని ఆయన అన్నారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేట్ వ్యక్తులకు సంస్థలకు కట్టబెట్టే ప్రయత్నాలకు వ్యతిరేకంగా ప్రజానీకం పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు.

ఉద్యమ అభ్యర్థులను గెలిపించాలి: యుటిఎఫ్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

మార్చిలో జరిగే పశ్చిమ రాయలసీమ శాసనమండలి ఉపాధ్యాయ, పట్టభద్రుల స్థానాలకు పోటీ చేస్తున్న ఉద్యమ అభ్యర్థులు కత్తి నరసింహారెడ్డి, పోతుల నాగరాజులను గెలిపించాలని యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్ కోరారు. పిడిఎఫ్ బలపరిచిన ఈ అభ్యర్థులను మండలికి పంపిస్తే ఉద్యోగుల ఉపాధ్యాయుల పక్షాన పోరాటం చేస్తారన్నారు. ఆదివారం కర్నూలులో స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో జిల్లా ఆఫీస్ బేరర్ల సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు ఎల్లప్ప అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొన్న కె.సురేష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు ఉపాధ్యాయుల పట్ల అనుచితంగా వ్యవహరిస్తుందన్నారు. వేతనాలు చెల్లింపులో నెలలో పదో తారీకు వచ్చినా ఇంకా చెల్లించ లేనటువంటి పరిస్థితి ఉందన్నారు. ముఖ ఆధారిత హాజరును వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 24న ఎన్‌పిఎస్ , ఎన్ఇపిలను రద్దు చేయాలని కోరుతూ చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను కూడా ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జయరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు వేతనాల చెల్లింపు విషయంలో తీవ్ర జాప్యం చేయడం తగదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సిబిఎస్ఇ విధానాన్ని నిలిపివేయాలన్నారు. ప్రస్తుతం ఉన్న విద్యా విధానాన్ని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం యుటిఎఫ్ జిల్లా కమిటీ స్టిక్కర్ క్యాలెండరును సురేష్ కుమార్‌తో పాటు ఇతర జిల్లా నాయకులు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు మారెప్ప, సహాధ్యక్షుడు రవికుమార్, జిల్లా కార్యదర్శులు దావీదు, నవీన్ పాటి యెహోషువ, నరసింహ, ఖాసిం వలీ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ , వైసిపి నాయకులు

జగనన్న ప్రభుత్వాన్ని దీవించండి

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్ : రాష్ట్రంలో అవినీతి రహిత పాలనను కొనసాగిస్తున్న జగనన్నను ఆశీర్వదించాలని కర్నూలు ఎమ్మెల్యే ఎంఎ.హాఫీజ్ ఖాన్, వైసిపి నగర అధ్యక్షులు సత్యనారాయణమ్మ అన్నారు. ఆదివారం 8వ వార్డ్ 21వ సచివాలయం పెద్ద పడఖాన, నది గడ్డ పరిధిలో గడపగడప కు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వార్డులో ప్రజలు, స్థానిక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో వాటిని అక్కడే ఉన్న అధికారులకు తెలిపి వెంటనే పరిష్కరించాలని వారిని ఆయన ఆదేశించారు. గతంలో తెలుగుదేశం నాయకులు ఓట్ల కోసం మాత్రమే ప్రజల వద్దకు వచ్చేవారని, గెలిచిన తర్వాత పట్టించుకునేవారు కాదన్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే అందిస్తున్నామన్నారు. వైసిపి సీనియర్ నాయకులు గడ్డం రామకృష్ణ, వక్ఫ్ బోర్డు జిల్లా సభ్యుడు అబ్రార్, పార్టీ నాయకులు షాకీర్, ఫరూఖ్, యూసుఫ్, బాసిత్, డాక్టర్ శేషన్న పాల్గొన్నారు.

డాక్టర్ మద్దిలేటికి తెలుగు తేజం జాతీయ విశిష్ట పురస్కారం

ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్

అవార్డు అందుకుంటున్న డాక్టర్ ఎన్‌కె.మద్దిలేటి

ప్రముఖకవి, రచయిత, తెలుగు సాహితీ వేత్త , విద్యావేత్త డాక్టర్ ఎన్‌కె. మద్దిలేటికి రెండు తెలుగు రాష్ట్రాలలో విద్యారంగం , సాహిత్య రంగాలలో చేస్తున్న కృషికి నల్గొండ జిల్లా పుడమి సేవా సంస్థ వారు తెలుగు తేజం జాతీయ విశిష్ట పురస్కారాన్ని ఈరోజు అందజేశారు. ఈ పురస్కారాన్ని మద్దిలేటి తెలుగు మహాకవులు శ్రీనాధుడు, కవయిత్రిమొల్ల, భక్త రామదాసు, ఏనుగు లక్ష్మణ కవి ,గిడుగు వెంకట రామమూర్తి వారసుల చేతుల మీదుగా అందుకున్నారు. శ్రీనాథ కవి సార్వభౌముని వారసులైన డాక్టర్ కావూరి శ్రీనివాస శర్మ, భక్త రామదాసు 10వతరం వారసులైన కంచర్ల శ్రీనివాసరావు, కవయిత్రి మొల్ల 14వ తరం వారసులైన మున్నెల్లి శివ శంకరయ్య, గిడుగు వెంకట రామమూర్తి పంతులు 4వతరం వారసులైన గిడుగువెంకట నాగేశ్వరరావు, ఏనుగు లక్ష్మణ కవి 6వతరం వారసులైన డాక్టర్ ఏనుగు శివరామ ప్రసాద్ డాక్టర్ మద్దిలేటి రచనలను , వారి సాహిత్య సేవను కొనియాడారు. కవయిత్రి మల్ల వారసులు మొల్ల రామాయణం తాళపత్ర గ్రంధాన్ని ఈ సభలో మహాకవుల వారసుల సాహిత్య ప్రసంగాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల నుండి కవులు, కళాకారులు, వివిధ రంగాలలో విశిష్ట సేవలు చేసిన అతి రథ మహారథులు పాల్గొన్నారు.

గూప్-1 ప్రిలిమినరీ పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన ఎస్‌పి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

జిల్లా కేంద్రంలో జనవరి 8న ఎపిఎస్‌పి గ్రూప్-1 స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించే పరీక్షా కేంద్రాలను జిల్లా ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్ ఆదివారం సందర్శించి, పరీక్ష కేంద్రాలలో భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. పోలీసు అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కర్నూలు పట్టణంలోని కెవిఆర్ కళాశాల, మాంటిస్సోరి(ఎ.క్యాంపు), పుల్లారెడ్డి కళాశాలను పరిశీలించారు. అనంతరం ఎస్‌పి మీడియాతో మాట్లాడారు. గ్రూప్- 1 ప్రాథమిక పరీక్ష కేంద్రాలలో క్లస్టర్ల వారీగా పకడ్బందీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. మాల్ ప్రాక్టీస్ వంటి సంఘటనలు జరగకుండా పకడ్బందీ భద్రత చర్యలు చేపట్టామన్నారు. జిల్లావ్యాప్తంగా 29 పరీక్ష కేంద్రాలలో పరీక్ష జరుగుతుందన్నారు. అభ్యర్థులు సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష కేంద్రాలలోనికి తీసుకెళ్లకుండా తనిఖీలు చేపట్టామన్నారు. జిల్లా ఎస్‌పి వెంట డిఎస్‌పి వెంకటాద్రి, మహేష్, నాగభూషణం, యుగంధర్ బాబు, సిఐలు శ్రీనివాసులు, రామలింగయ్య, శేషయ్య, ఎస్‌ఐలు ఉన్నారు.

పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్

ఆవాజ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న రిటైర్ట్ జస్టిస్ చంద్రకుమార్, ఎంఎ.గఫూర్

ఆవాజ్ కమిటీ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : కర్నూలు ఆవాజ్ కమిటీ ముద్రించిన క్యాలెండర్లను గుంటూరులో జనవరి 8, 9 తేదీలలో నిర్వహిస్తున్న రెండవ రాష్ట్ర మహాసభల సందర్భంగా గుంటూరులో హైకోర్టు రిటైర్డ్ జడ్జి బి చంద్ర కుమార్, ఆవాజ్ కమిటీ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు, కర్నూలు మాజీ శాసనసభ్యులు ఎంఎ. గఫూర్, ఆవాస్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎంఎ చిస్తి , కర్నూలు ఆవాజ్ జిల్లా నాయకులు ఎస్ఎ.సుభాన్, పి.ఇక్బాల్ హుస్సేన్, ఇస్మాయిల్, ముహమ్మద్‌షరీఫ్, ఇంతియాజ్, నయీమ్ ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఆవాజ్ కమిటీగా క్యాలెండర్లు ముద్రించి ఆ రకంగా ప్రజలకు డిస్ట్రిబ్యూట్ చేసి జిల్లాల వ్యాప్తంగా ఆవాజ్ కమిటీ ప్రచారం జరుగుతుందన్నారు. ఇదే మాదిరిగా మిగతా నగర, జిల్లా కమిటీలు కూడా క్యాలెండర్లు ప్రింట్ చేసి ప్రజలకు పంచాలని వారు కోరారు. ఆవాజ్ నాయకులు ఫయాజుల్‌కరీం, చాన్‌బాషా, అయూబ్, ఫయాజ్ ఖాద్రి, నూర్‌వలి , మాలిక్ బాషా, అబ్దుల్ రెహమాన్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సుకు ప్రొఫెసర్ ఇ. వెంకటేశు

ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్

కర్నూలు జిల్లాకు చెందిన ప్రొఫెసర్ ఇ.వెంకటేశు అంతర్జాతీయ సదస్సుకు హాజరు కానున్నారు. అమెరికాలోని డెన్వర్ రాష్ట్రంలో గల సుప్రసిద్ధ కొలరాడో విశ్వవిద్యాలయంలో ప్రభుత్వ విధానాలపై అంతర్జాతీయ సదస్సు జనవరి 12 నుండి 14 వరకు జరగనున్న సదస్సుకు ప్రపంచ వ్యాప్తంగా 200 మంది ప్రతినిధులు హాజరవనున్నారు. ఈ సదస్సుకు భారత దేశం నుండి హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం లోని రాజనీతి శాస్త్ర విభాగానికి చెందిన ప్రొఫెసర్. ఇ. వెంకటేశు '75 ఏండ్ల స్వతంత్ర భారత దేశం లో ప్రభుత్వ విధానాలు' అంశం పై తన పరిశోధన పత్రం పై ప్రసంగించనున్నారు. తన పరిశోధన పత్రం పై ప్రసంగించడానికి ప్రపంచ వ్యాప్తంగా పేరు ప్రతిష్టలున్న ప్రభుత్వ పాలన సిద్ధాంతకర్తలైన ప్రొఫెసర్. క్రిష్టోఫర్ వేబుల్ , ప్రొఫెసర్ జెంకిన్ స్మిత్ , ప్రొఫెసర్. అలేగ్ర లాంటి వారు ప్రత్యేకమైన ఆసక్తిని కనపర్చి భారత దేశం నుండి ప్రొఫెసర్. ఇ. వెంకటేశుని ఆహ్వానిచారు. ప్రొఫెసర్ ఇ. వెంకటేశు కర్నూలు జిల్లాలోని ఎమ్మిగనూర్ మండలం , పెసలదిన్నె గ్రామానికి చెందిన వారు.

క్రీడలు మనిషి జీవితంలో భాగం కావాలి : టిజి.భరత్

ప్రజాశక్తి-కర్నూలు స్పోర్ట్స్ : మనిషి జీవితంలో క్రీడలు ఒక భాగం అవ్వాలని కర్నూలు నియోజకవర్గ తెలుగుదేశం ఇంఛార్జీ టిజి భరత్ అన్నారు. ఆదివారం నగరంలోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల మైదానంలో కర్నూలులో స్థిరపడ్డ రాజస్థాన్ రాష్ట్ర వారు నిర్వహించిన రాజస్థాన్ ప్రీమియర్ లీగ్9 క్రికెట్ పోటీలను టిజి.భరత్ ప్రారంభించారు. అందరితో కలిసి ఆయన క్రికెట్ ఆడారు. అనంతరం టిజి.భరత్ మాట్లాడుతూ వ్యక్తిగత పనుల్లో బిజీగా ఉండేవాళ్లకు ప్రతిరోజు కొద్దిసేపు క్రీడల్లో పాల్గొనడం వల్ల ఒత్తిడి తగ్గుతుందన్నారు. కర్నూలులో రాజస్థాన్ ప్రీమియర్ లీగ్‌తో పాటు, వైశ్యులు, మార్వాడీలు, జైనులు కూడా లీగ్ క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ అన్ని లీగ్ పోటీల్లోని విన్నర్స్, రన్నర్స్‌తో కలిపి ఒక లీగ్ నిర్వహించేందుకు తాను ఏర్పాట్లు చేస్తానని తెలిపారు. మహిళలను కూడా క్రీడల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని చెప్పారు. ఇక కర్నూలు ప్రజలకు ఎలాంటి సహాయం కావాలన్న టిజి కుటుంబం ముందు వరుసలో ఉంటుందన్నారు. అధికారం ఉన్న లేకున్నా తాము ప్రజాసేవలో ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో కైలాష్, ఆర్యన్, హితేష్, రంజిత్, సురేష్, ప్రమోద్, తదితరులు పాల్గొన్నారు.

మానసిక,శారీరక ఆరోగ్యానికి కరాటే అవసరం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



చిన్నారికి బెల్టును, సర్టిఫికెట్‌ను ప్రదానం చేస్తున్న గౌస్‌దేశాయి, డాక్టర్ వినోద్

జోహారాపురం షడ్రక్ నగర్ కాలనీలో సుందరయ్య స్ఫూర్తి కేంద్రం ఆధ్వర్యంలో యూనివర్సల్ కరాటే అసోసియేషన్ ఫౌండర్ అండ్ డైరెక్టర్ మాస్టర్ టి. శ్రీనివాసులు సహకారంతో మాస్టర్ సుధాకర్ పిల్లలకు బెల్టు గ్రేడింగ్ టెస్టులు నిర్వహించారు. ఆదివారం సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మారెళ్ళ విజయ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, డాక్టర్ వినోద్, సిపిఎం నగర కార్యదర్శి రాజశేఖర్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప హాజరయ్యారు. గౌస్ దేశాయ్, డాక్టర్ వినోద్ మాట్లాడుతూ పిల్లల మానసిక, శారీరక ఆరోగ్యానికి కరాటే ఎంతో అవసరమని, సుందరయ్య స్ఫూర్తి కేంద్రం వారు యూనివర్సల్ కరాటే అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో పేదలు నివసించే షడ్రక్‌నగర్ లాంటి ఏరియాలో పిల్లలకు ఉచిత కరాటే శిక్షణ నేర్పించడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ కరాటే పోటీలలో మట్టిలోని మాణిక్యాలను చూసామని వారి అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇలాంటి వారికి ప్రభుత్వం ప్రోత్సహించకపోగా క్రీడాకారులకు ఉపయోగపడే స్టేడియాలను ప్రైవేటీకరించి చార్జీలు వసూలు చేయడం దురదృష్టకరమన్నారు. చాలా స్కూళ్లు కాలేజీలలో పిల్లలు ఆడుకోవడానికి మైదానాలు లేక ఆడుకునే పరిస్థితి లేదన్నారు. ఉన్నచోట పిఇటి టీచర్లు లేక ఆటలలో వెనుకబడి పోతున్నారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో ఇలాంటి సంస్థలు పేదల కోసం, పేదల పిల్లల కోసం పనిచేయడం మంచి పరిణామమన్నారు. ఈ బెల్ట్ గ్రేడింగ్ టెస్టు కు ఎగ్జామినర్స్‌గా మాస్టర్ చిన్న శ్రీనివాసులు, మాస్టర్ భూపతి, మాస్టర్ నాగన్న, మాస్టర్ అమితీశ్వర్లు హాజరయ్యారు. ఈ టెస్ట్ లో 38 మంది పిల్లలు పోటీ పడగా గ్రీన్ బెల్టుకు 9 మంది, ఆరంజ్ బెల్టు కు 9 మంది, బ్లూ బెల్ట్ కు 12 మంది, మెరిన్ రెడ్ బెల్ట్ కు 10 మంది ఎంపిక అయ్యారని తెలిపారు. సిపిఎం నగర నాయకులు రంగస్వామి, నాగరాజు, దాసు, కుమార్, మద్దిలేటి, కృష్ణ, బహదూర్, అబ్దుల్లా, విజయలక్ష్మి, రవి, కెవిపిఎస్ నాయకులు రమణ, మౌలాలి, ఎస్ఎఫ్ఐ నగర నాయకులు సాయి, అమర్ బాబు, అబ్బు , కాలనీవాసులు పాల్గొన్నారు.

సావిత్రి భాయి చిత్ర పటానికి నివాళి అర్పించిన దృశ్యం

మహిళల విద్యాభివృద్ధికి

ప్రభుత్వం కృషి చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - ఆదోని

మహిళల విద్య అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నాగమణి, జిల్లా సహాధ్యక్షురాలు జీవిత పేర్కొన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సావిత్రిబాయి పూలే జయంతి వారోత్సవాల్లో భాగంగా ఆదివారం గర్ల్స్ హాస్టల్లో ప్రస్తుత ప్రభుత్వ విద్యా విధానాలు బాలికల విద్య అనే అంశంపై సదస్సు యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి నాగలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. అంతకుముందు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలతో నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అన్ని రంగాలలో మహిళలు రాణిస్తున్న ఇప్పటికి ఎక్కడో ఒకచోట అవమానాలు అవహేళనకు గురవుతూనే ఉన్నారన్నారు. మహిళల రక్షణ కోసం చట్టాలు ఉన్న పకడ్బందీగా అమలు చేయడంలో ప్రభుత్వాలు ఘోరంగా వైఫల్యం చెందాయన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మహిళ నాయకురాలు రాణి, కుమిదిని దేవి, వీర శ్రీ, రేణుక భాయ్, భాగ్యమ్మ, హాస్టల్ వార్డెన్ మాధవి పాల్గొన్నారు.

సౌత్ జోన్ నేషనల్ ఖోఖో మీట్‌కు వందగల్లు క్రీడాకారుడు

ప్రజాశక్తి - కోసిగి రూరల్

మండలంలోని వందగల్లు గ్రామానికి చెందిన హనుమంతమ్మ, భీమన్న దంపతుల కుమారుడు చాకలి రాము సౌత్ జోన్ నేషనల్ ఖోఖో మీట్‌కు ఎంపికయ్యాడు. రాము ఎమ్మిగనూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బిఎ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. గత సంవత్సరం డిసెంబర్ 28, 29 తేదీలలో కర్నూలు సిల్వర్ జూబ్లీ కళాశాలలో జరిగిన రాయలసీమ యూనివర్సిటీ ఖోఖో పోటీలకు కళాశాల తరుపున వెళ్లగా జట్టు రన్నర్‌గా విజయం సాధించడం జరిగింది. ఇందులో రాము కీలక పాత్ర పోషించాడు. ఈ నెల9వ తేది నుండి12 తేదీ వరకు కాకినాడలో జరిగే సౌత్ జోన్ నేషనల్ ఖోఖో పోటీల్లో రాము పాల్గొనున్నాడు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, గ్రామస్తులు, పూర్వపు విద్యార్థులు, క్రీడాకారులు రాముకి అభినందనలు తెలిపారు.

నేషనల్ ఖోఖో మీట్ ఎంపికైన క్రీడాకారుడు రాము

ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న టిడిపి నాయకులు

సొంతింటి కల నెరవేర్చని ప్రభుత్వం : టిడిపి

ప్రజాశక్తి - ఆదోని

పేదల సొంతింటి కల సాకారం చేస్తామని అధికారంలోకి వచ్చిన సీఎం జగన్మోహన్ రెడ్డి మాట మార్చారని టిడిపి నాయకులు డికె జగదీష్ విమర్శించారు. ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యాక్రమం భాగంగా ఆదివా రం కల్లుబావి వీధి, వైయస్సార్ నగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు కాలనీలో రోడ్లు, డ్రైనేజీ ఇతర మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇంటికి అద్దెలు చెల్లించుకోలేక ఇబ్బందులు పడుతున్నామని పేదలు వాపోతున్నారన్నారు. ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేక భావన పెరిగిందన్నారు. కార్యక్రమంలో నాయకులు కోట ఈరన్న, మల్లికార్జున, సామెల్, అనిల్ కుమార్ తదితరులు ఉన్నారు.

హత్యలు ఎవరి కోసం ?

ఆధిపత్యం ముసుగులో ఈజీ మని వ్యవహారమే కారణమా

ప్రజాశక్తి - ఆదోని

ఆధిపత్యం ముసుగులో ప్రశాంత గ్రామాల్లో కల్లోలం మొదలైంది. నిక్కచ్చిగా వ్యవహారాదించాల్సిన రాజకీయ నాయకులు, పోలీసుల రెండు నాల్కల ధోరణి అవలంబించడం వలన చిన్నపాటి ఘటనలు కూడా హత్యలకు కారణం అవుతున్నాయని పలువురు చెబుతున్నారు. రాజకీయ ముసుగులో ఆధిపత్యం ధోరణి అవలంబిస్తూ, ఈజీ మనీ కోసం ఒకరికొకరు చంపుకునే దాకా దారితీస్తున్నాయి. ప్రశాంతమైన గ్రామాలు ప్రస్తుతం హత్యలు, కార్పన్యాలు దాడులకు నిలయాలుగా మారుతున్నాయి. దీనంతటికీ కారణం వారి వెనక రాజకీయ నాయకుల రెచ్చగొట్టే ధోరణి, నేనున్నాను అంటూ ప్రోద్బలం ఇస్తూ ఉషికొల్పుతున్నారని పలువు చెబుతున్నారు. **ఈజీ మనీ అరికట్టే వారే కరువు:** కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన ఆదోని, హోళగుంద, కౌతాళం, కోసిగి ప్రాంతాలలో కర్ణాటక మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. కర్ణాటక మద్యం, కల్లు విక్రయించాలన్న రాజకీయ నాయకుల సహకారం, పోలీసుల చూసి చూడనట్లు వ్యవహరించడం అవసరమని విమర్శలు ఉన్నాయి. తక్కువ ధరకు లభించే కర్ణాటక మద్యం అధిక లాభాలు గడిస్తున్నారు. పెట్టుబడి లేకుండా కల్లు దుకాణం నిర్వహణ ఈ నేపథ్యంలోనే మద్యం అమ్మకాల్లో కూడా తామంటే తాము విక్రయించాలంటూ ఇరువర్గాలు ఘర్షణలు దిగి సినిమా ఫక్కీలో హత్యల కు పాల్పడిన ఘటనలు ఉన్నాయి. కౌతాళం మండలం కామవరం, నది చాగి, హాల్వి గ్రామాలలో ఇటీవల చోటు చేసుకున్న ఘర్షణలు హత్యలు పరిశీలిస్తే తెలుస్తోందని విశ్లేషకులు చెబుతున్నారు. గ్రామాలలో వైసిపి వర్సెస్ టిడిపి వారి మధ్య గతంలో ఘర్షణలు జరిగేవని చెబుతున్నారు. ప్రస్తుతము కౌతాలం మండలంలో బిజెపి వైసిపి నాయకుల మధ్య హత్యల పరంపరం కొనసాగడం చూస్తుంటే ఎంత మేర రెచ్చగొడుతున్నారో అర్థమ వుతుందని ప్రజలు చర్చించుకుంటున్నారు. తమ నాయకుడు రెడ్డి సామాజిక వర్గం చెందిన వ్యక్తిని దూషించారని ప్రశ్నించినందుకు కామవరంలో గత ఏడాది జనవరి చివరి వారంలో ఇద్దరు దళితులు దారుణంగా హత్యకు గురయ్యారు. ఏడాది గడవకముందే జనవరిలో అదే మండలంలో బిజెపికి చెందిన శివకుమార్ గౌడ్‌ను హత్య జరగడం చూస్తుంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతోంది. రాజకీయ ఆధిపత్యం కోసం రెచ్చగొట్టే ధోరణి అవలంబిస్తూ బడా నేతలు తెరవెనక ఉంటూ బడుగు బలహీన వర్గాలను కత్తులకు బలి చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. స్వాతంత్రం సిద్ధించి 75 ఏళ్ళు గడిచిన ఇప్పటికే అగ్రవర్ణాల చేతిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు కీలుబొమ్మలుగా మారి హత్యలకు తెగబడడం జరుగుతుందని పలువురు వాపోతున్నారు. చిన్నపాటి ఘర్షణ జరిగిన ప్రాంతంలో పోలీసులు కఠినంగా వ్యవహరిస్తే పరిస్థితి హత్యల వరకు దారి తీసేది కాదని చెబుతున్నారు తొడలు కొట్టుకోవడం, మీసాలు దువ్వడం చూసి తమ నాయకుడు పౌరుష వంతుడు అంటూ రెచ్చిపోతు ప్రాణాలు పోగొట్టుకుంటూ కుటుంబాలకు అన్యాయం చేస్తున్నారని చెబుతున్నారు. కౌతాళం మండలంలో మాత్రం హీరో గోపీచంద్ నటించిన యజ్ఞం సినిమా లాగా సీను తలపిస్తుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు నిజానిజాలు తెలుసుకొని హత్యలకు దారి తీయకుండా కౌన్సిలింగ్ ఇస్తూ పరిస్థితి చక్కదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.

హత్యకు గురైన బాధితులు (ఫైల్)

మాట్లాడుతున్న సిపిఎం మండల నాయకులు తిక్కప్ప

కొట్టంకు నిప్పు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఆదోని రూరల్

మండల పరిధిలో పెద్ద హరివాణం గ్రామంలో రాత్రి సమయంలో కొందరు వ్యక్తులు కురివాసప్ప అనే కొట్టానికి కొందరు వ్యక్తులు నిప్పంటించారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల నాయకులు తిక్కప్ప డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన కాలిపోయిన కొట్టంను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కొట్టంకు నిప్పు అంటించడం వల్ల సుమారుగా రెండు క్వింటాలు పైగా బియ్యము,బట్టలు కాలిపోయాయి అన్నారు. కురివాసప్ప కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి, కొత్త ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ప్రిన్సిపాల్ సురేంద్రబాబుతో మాట్లాడుతున్న నాయకులు

సెలవుల్లో తరగతులు నిర్వహించే విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ఆదోని

సెలవు దినాల్లోనూ తరగతులు నిర్వహించే విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ ఉదయ్, ఐసా నాయకుడు అనిల్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆదోనిలో డిఎస్ఎఫ్, ఐసా విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నారాయణ కాలేజీ, భాష్యం స్కూల్‌ను సందర్శించి బంద్ చేయించారు. సెలవు దినాల్లో కూడా తరగతులు నిర్వహించి విద్య హక్కు చట్టానికి తూట్లు పొడుస్తున్నారని విమర్శించారు. కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థలపై ప్రభుత్వ విద్యాధికారులు నిఘా ఉంచాలన్నారు. విద్య హక్కు చట్టాన్ని పకడ్బ ందీగా అమలు చేయాల్సిన బాధ్యత అధికా రుల పై ఉందన్నారు. డిఎస్ఎఫ్ నాయకులు రవి, చిరు, వంశీ, అరవింద్, ప్రభాకర్, అభి పాల్గొన్నారు.

13 నుండి ఆస్పరిలో జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి - ఆస్పరి

సంక్రాంతి పండుగ సందర్భంగా ఆస్పరిలో జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను ఆస్పరి యూత్ సేవ సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆర్గనేజర్స్ రామక్రిష్ణ, అరవింద్, మహేష్, నరసింహ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 13,14,15వ తేదీల్లో కబడ్డీ పోటీలు పెట్టడం జరిగిందన్నారు. ఈ నెల 11లోపు ఆసక్తి ఉన్న వారు రూ.500 ఎంట్రీ ఫీజ్ చెలించి తమ జట్టు పేరును నమోదు చేసుకోవాలని తెలిపారు. గెలుపొందిన జట్లకు మొదటి బహుమతి చిప్పగిరి జడ్పీటీసీ విరుపాక్షి రూ.20,116, రెండవ బహుమతి గ్రంథాలయ జిల్లా మాజీ ఛైర్మన్ శంకర్ రెడ్డి కుమార్తె మిత్ర రెడ్డి రూ.10,116, మూడవ బహుమతి మేకల రంగనాథ్ రూ.5,116 లు అందజేయడం జరుగు తుందన్నారు. మరిన్ని 9912951780, 7702057770, 9573117122 లకు ఫోన్ చేయాలన్నారు. యూత్ సేవ సమితి హేమంత,నరసప్ప, విజయ్, బాలముని, రాజు,రవి,వీరేష్,సంజన్న పాల్గొన్నారు.

సమగ్ర సర్వేతో భూ సమస్యలకు పరిష్కారం

పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వై.బాలనాగి రెడ్డి

ప్రజాశక్తి - కోసిగి రూరల్

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూ సర్వేతో రైతుల భూ సమస్యలు పరిష్కారమవుతున్నాయని ఎమ్మెల్యే బాల నాగిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని దుద్ది,వందగల్లు గౌడగల్లు గ్రామాల్లో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మండల ఇంచార్జి మురళీమోహన్ రెడ్డితో కలిసి శాసనసభ్యులు వై.బాలనాగి రెడ్డి ఆదివారం పాల్గొన్నారు. ముందుగా దుద్ది గ్రామ సచివాలయం పరిధిలో దాదాపు 21లక్షల రూపాయలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రమును ప్రారంభించారు. వందగల్లులో తహశీల్దార్ రుద్రగౌడ్ ఆధ్వర్యంలో జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం ద్వారా మంజూరైన ఈ-పాసుపుస్తకాలను లబ్ధిదారులకు అందజే శారు. అలాగే గౌడగల్లు గ్రామంలో జలజీవన్ మిషన్ పథకం కింద దాదాపు 10 లక్షల రూపాయలతో ఇంటి,ఇంటికి కోళాయి పథకాన్ని ప్రారం భించారు. అనంతరం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి మాట్లాడుతూ రైతుల ముంగిట నాణ్యమైన సేవలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, రైతులందరూ ఆర్బీకే సేవలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. దేశచరిత్రలో ఎవరూ చేయలేని విధంగా బ్రిటిష్ కాలం నాటి సర్వే వ్యవస్థను ప్రక్షాళన చేసి సమగ్రమైన భూసర్వేను చేపట్టి భూ సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందన్నారు. అనంతరం మండల పరిధిలోని వందగల్లు గ్రామంలో 916 భూపత్రాల ను రైతులకు అందించారు. ఎవరికైనా సందేహాలు ఉంటే అప్పీలు చేసుకోవ చ్చని పేర్కొన్నారు. ఇచ్చిన మాటను కట్టుబడి,ఎన్నికల హామీలో భాగంగా గౌడగల్లు గ్రామంలో తాగునీటి ఎద్దడి నివారణకు జలజీవన్ మిషన్ పథకం కింద దాదాపు 175 కోళాయిలు ఇంటి ఇంటికి వేయడం జరిగిందని తెలిపారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీ,పీఆర్ డీఈ అశ్వత్థామ, పీఆర్ ఏఈ యుగంధర్ రెడ్డి,వ్యవసాయ అధికారి రాజు,ఏఈ మల్లికార్జున రెడ్డి, ఎంపీపీ ఈరన్న, మండల సీనియర్ నాయకులు నాడిగేని నరసింహులు,కన్వీనర్ బెట్టన గౌడ్, మహంతేష్ స్వామి, ఐరనగల్లు శ్రీనివాసరెడ్డి, జగదీష్ స్వామి, మంగమ్మ, మాణిక్యరాజు,యన్ నాగరాజు, హాజీ ఉస్మాన్,వి.వెంకటేష్, జంపాపురం బసిరెడ్డి,దుద్ది నాగేష్,దొడ్డి నర్సన్న, దుద్ది రామలింగ,కాల్వ లక్ష్మయ్య వందగల్ సర్పంచ్ కోరవంజమ్మ, నెలకోసిగి సర్పంచ్ హనుమంతమ్మ, దుద్ది సర్పంచ్ వర లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

భూ రక్ష పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

బందోబస్తు నడుమ శివ కుమార్ గౌడ్ అంత్యక్రియలు

ప్రజాశక్తి - కౌతాళం

కౌతాళం పోలీస్ స్టేషన్ పరిధిలోని నదిచాగీ గ్రామంలో భారీగా పోలీస్ బందోబస్తు ఆదివారం నిర్వహించారు. బిజెపి నాయకులు శివ కుమార్ గౌడ్ దారుణ హత్యకు గురి కావడ ంతో గ్రామంలో ఎలాంటి అవాంఛ నియా సంఘటన జరగకుండా బందోబస్తు నిర్వహిస్తున్నట్లు సీఐ ఎరిష వలి తెలిపారు. **5 మందిపై కేసు నమోదు:** శివకుమార్ గౌడ్ హత్య కేసులో భార్య సుజాత ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి తెలిపారు. నది చాగి గ్రామానికి చెందిన బసన్న గౌడ్, హరిజన దేవన్న, హరిజన రాము, హరిజన ముదేప్ప, రామన్న గౌడ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామన్నారు.

అంతక్రియలో పాల్గొన్న నాయకులు: నది చాగి గ్రామంలో శివకుమార్ గౌడ్ అంత్యక్రియలు బిజెపి రాష్ట్ర నాయకులు కపిలేశ్వరయ్య, జిల్లా అధ్యక్షులు రామస్వామి, హైకోర్టు సీనియర్ న్యాయవాది, ఆదోని డివిజన్ ఇన్చార్జ్ పురుషోత్తం రెడ్డితోపాటు మండలంలోని ఆయా గ్రామ నాయకులు, కార్యకర్తలు ఆదివారం పాల్గొన్నారు.

అంత్యక్రియల్లో పాల్గొన్న బిజెపి నేతలు, తదితరులు

శివ కుమార్ గౌడ్ మృతదేహాన్ని పరిశీలించిన డిఎస్పి

ఆదోని : డివిజన్ పరిధిలోని కౌతాళం మండలం కుంభలనూరులో శనివారం దారుణ హత్యకు గురైన బిజెపి నాయకుడు ఈడిగ శివకుమార్ గౌడ్ మృతదేహాన్ని ఆదోని ఏరియా ఆసుపత్రిలో డిఎస్పి వినోద్ కుమార్, డాక్టర్ ఆది నాగేష్ ఆదివారం పరిశీలించారు. బంధువులతో హత్యకు గల కారణాలు డిఎస్పి ఆరా తీశారు.

కుంభలనూరు గ్రామంలో కల్లు దుకాణం దగ్గర గుర్తు తెలియని వ్యక్తులు కళ్ళలో కారం వేసి, వేట కొడవళ్ళతో దాడి చేసిన విషయం విధితమే. తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడని బంధువులు తెలిపారు. మృతుడు 8 నెలల క్రితం నదిచాగి గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు రామన్న గౌడ్ హత్యాయత్నం కేసులో ప్రధాన నిందితుడుగా ఉన్నాడని పోలీసులు తెలిపారు. 4 నెలల క్రితం వైసిపి వర్గ పోరుతో బిజెపిలో చేరాడని స్థానికులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటన జరగకుండా పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నట్లు డిఎస్పి తెలిపారు. నిందితులను గుర్తించి వెంటనే అరెస్ట్ చేస్తామని తెలిపారు.

మృతదేహంపై గాయాలను పరిశీలిస్తున్న డిఎస్పి

వలస వెళుతున్న వ్యవసాయ కూలీలు

ఉపాధి లేక... కొనసాగుతున్న వలసలు

ప్రజాశక్తి - కౌతాళం

గ్రామీణ ప్రాంతాలలో పనులు లేకపోవడంతో వ్యవసాయ కూలీలు పట్టణ ప్రాంతాలకు వెళ్తున్నారు. ఆదివారం మండల పరిధిలోని పో దలకుంట గ్రామం నుండి రెండు లారీల్లో సుమారు 100 కుటుంబాలు గుంటూరు ప్రాంతానికి వలస వెళ్లారు. ఈ ఏడాది అధిక వర్షాలతో పంటలు పూర్తిగా దెబ్బ తినడంతో వ్యవసాయ కూలీలకు పనులు కరువయ్యాయి. సన్న చిన్న కర రైతులు వ్యవసాయం కోసం చేసిన అప్పులు మిగలడంతో కొలతలు తప్పడం లేదని వదలకుంట గ్రామానికి చెందిన రైతులు మారెప్ప హనుమంతు, ఈరమ్మ, నరసమ్మ మరి కొంతమంది తెలిపారు. ప్రభుత్వం కూడా ఉపాధి పనులు కల్పించక పోవడంతో తప్పని పరిస్థితులలో లేక వలస వెళ్లక చెప్పడం లేదన్నారు. పిల్ల పాపలతో మూటలు కట్టుకొని లారీల ద్వారా తరలి వెళారు.

దేవరగట్టులో పూజలు

ప్రజాశక్తి - హోళగుంద

మండల పరిధిలోని నెరనికి, ఎన్ తాండ, కొత్తపేట కొండ గుహలలో వెలిసిన శ్రీ మాల మల్లేశ్వర సన్నిధి దేవరగట్టులో ఆదివారం పూజలు నిర్వహించారు. భక్తులు ఉదయం నుండి బార్లు తీరి స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. ప్రతి ఆదివారం అమావాస్య సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడం విశేషం.

శ్రీ మఠంలో భక్తుల కోలాహలం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో భక్తుల కోలాహలం నెలకొంది. ఆదివారం రాఘవేంద్రుని దర్శనార్థమై దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి మంత్రాలయం చేరుకొని రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. ఈ మేరకు స్వర్ణ పల్లకీ ఊరేగించారు. ధనుర్మాసం కావడంతో శ్రీ మఠం నిర్వహణలో ఉన్న భోజన శాలలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు భక్తులకు ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.

శ్రీ మఠానికి రూ. 4,01,000 లు విరాళం

- శ్రీ మఠం మేనేజర్ యస్కే శ్రీనివాసరావు

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో జరుగుతున్న వివిధ సేవా కార్యక్రమాలకు భక్తుల నుంచి రూ.4,01,000 లు విరాళంగా వచ్చినట్లు శ్రీ మఠం మేనేజర్ యస్కే శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులకు సమాచారం అందిం చారు. రాఘవేంద్రస్వామి దర్శనార్థమై మంత్రాలయం వచ్చిన దర్శన అనంతరం కర్నాటక రాష్ట్రంలోని బెంగళూరుకు చెందిన ఎ. సుధీంద్ర అనే భక్తుడు 3 రూ.లక్ష గో సంరక్షణకు అందజేసినట్లు తెలిపారు. శ్రీ మఠంలో నూతనంగా తయారు చేయించు వెండి రథోత్సవానికి కర్నాటక రాష్ట్రంలోని రాయచూర్‌కు చెందిన సి. రాఘవేంద్ర రూ.1,01,000 వెండి రథోత్సవ తయారీకి విరాళంగా అందజేశారు. దాతలకు శ్రీ మఠం పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థులు శేష వస్త్రాలను అందజేశారు.

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం : జెఎస్‌పి

ప్రజాశక్తి - దేవనకొండ

మూడున్నర ఏళ్ల వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యమని ఆలూరు జనసేన పార్టీ ఇంచార్జ్ తెర్నేకల్లు వెంకప్ప విమర్శించారు. ఆదివారం మండలంలోని పల్లెదొడ్డి, గద్దె రాళ్ల గ్రామాలలో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వెంకప్ప మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు తప్ప గ్రామాల్లో అభివృద్ధి శూన్యమన్నారు. పొరుగు రాష్ట్రాలతో పోల్చుకుంటే పెట్రోల్, డీజిల్, విద్యుత్ చార్జీలు, నిత్యావసర ధరలను విపరీతంగా పెంచి సామాన్య మధ్యతరగతి ప్రజలపై పెనుభారం మోపారని ఆరోపించారు. రైతు ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకోవడం తప్ప రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడంలో వైసిపి ప్రభుత్వం విఫలం చెందిం దని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మక్బూల్, నందు, వీరేష్, బడే సాహెబ్, కృపాకర్, నరేష్ కౌలుట్ల, కార్తీక్ పాల్గొన్నారు.

పోస్టర్లు అవిష్కరిస్తున్న జనసేన ఎల్లప్ప, జనసైనికులు

నందవరం : మండల కేంద్రమైన నందవరంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఈ నెల 12 న శ్రీకాకుళంలో ఏర్పాటు చేసిన జనసేన యువశక్తి పోస్టర్లను నందవరం పంచాయతీ ఆవరణలో ఆదివారం విడుదల చేశారు. యువతలో మేలుకొలుపు కోసం జనసేనాని పవన్ కల్యాణ్ యువశక్తి కార్యక్రమానాన్ని నిర్వహిస్తున్నారని, ప్రస్తుత ప్రభుత్వంలో యువతకు జరుగుతున్న అన్యాయాన్ని ఎత్తిచూపేందుకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నా రన్నారు. 'రా కదిలి రా నీ గళాన్ని వినిపించు' అనే నినాదంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, యువత ముందుకు వచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జన సైనికులు చంద్ర, అంజి, ఇమ్రాన్ బాషా, సర్దార్, జయరాముడు, ఇసాక్, తదితరులు పాల్గొన్నారు.

జనసేన యువశక్తి పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

దోబీ పోస్టులను రజకులకే కేటాయించాలి : రజక సంఘం

ప్రజాశక్తి - ఆదోని

జీఓ27 ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా దేవాలయాల్లో, పోలీస్ శాఖలో, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న దోబీ పోస్టులను రజకులకే కేటాయిం చాలని రజక సంఘం జిల్లా అధ్యక్షుడు సి ముక్కన్న డిమాండ్ చేశారు. ఆదివారం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. షాపులు ఉన్న వారికి మాత్రమే కాకుండా ఇంటి దగ్గర పని చేస్తున్న వారికి కూడా జగనన్న చేదోడు కింద రూ.10 వేలు ఆర్థిక సాయమందించాలన్నారు. రజక కార్పొరేషన్లకు వెయ్యి కోట్లు బడ్జెట్ కేటాయి ంచాలని, 50 ఏళ్లు నిండిన రజకులకు పెన్షన్ ఇవ్వాలని, రజకులకు కమ్యూనిటీ హాళ్లకు, ధోబి ఘాట్లు నిర్మించుకునేందుకు నిధులు కేటాయిం చాలని కోరారు. అనంతరం 2023 క్యాలెండర్‌ను ఆవిష్కరిం చారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు రామన్న, ఉరుకుందు, ఈరన్న, నాగరా జు, చిదానంద, పట్టణ నాయకులు నాగప్ప, మల్ల ప్ప, మల్లయ్య, ప్రకాష్, నాగరాజు పాల్గొన్నారు.

బిసి వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలి

ప్రజాశక్తి - ఆదోని

జిల్లా వ్యాప్తంగా ఉన్న బీసీ వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు మలేకర్ శ్రీనివాసులు, బిజెపి జిల్లా కార్యదర్శి నాగరాజు గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో బీసీ పోస్టు మెట్రిక్ విద్యార్థుల హాస్టల్‌లో బిజెపి ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడు బాలాజీ ఆధ్వర్యంలో సందర్శించి విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ వసతి గృహాల ఏర్పాటుకు రెవెన్యూ అధికారులు స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. సమస్యలను నివేదిక రూపంలో తయారు చేసే ఉన్నతాధికారులకు సమర్పించి సమస్యల పరిష్కారమ య్యేంత వరకు పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నగర అధ్యక్షుడు వాల్మీకి మహదేవ్, పట్టణ ఉపాధ్యక్షుడు దేవేంద్ర కుమార్, ఓబీసీ మోర్చా నాయకులు రామకృష్ణ, వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, గోవిందరాజులు, రాము, మధుసూదన్ పాల్గొన్నారు.

పరిసరాలను పరిశీలించిన నాయకులు

13 మందిని కాటేసిన పిచ్చికుక్క

ప్రజాశక్తి - ఆదోని రూరల్

మండలం పరిధిలో పెద్దహరివాణం గ్రామంలో ఆదివారం పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. ఈ దాడిలో దాదాపు 13మందికి పైగా కాలనీ వాసులు తీవ్రంగా గాయపడినట్లు స్థానికులు తెలిపారు. శనివారం అర్థరాత్రి నుంచి రాత్రి కాలనీలో పాదచారులు, బయట ఆడుకుంటున్న చిన్నారులపై పిచ్చి కుక్క దాడి చేసింది. ఫలితంగా కాలనీలో నివసించే వారితో పాటు అటుగా వెళ్తున్న పాదచారులు సైతం తీవ్ర గాయాల పాలయ్యారు. అయిదేళ్ల చిన్నారిపై పిచ్చి కుక్క విచుకుపడటంతో తీవ్ర గాయమై రక్తస్రావం జరిగింది.

కుక్కల,పందులు బెడద తప్పేదెప్పుడు..?

గ్రామాలలో కుక్కల,పందుల సంతాన నియంత్రణకు వేల రూపాయలు ఖర్చు చేస్తున్నప్పటికీ, గ్రామాలలో పిచ్చి కుక్కల బెడద తప్పడం లేదు. కుక్కల సంఖ్యను తగ్గించేందుకు ఏడాది క్రితం గ్రామంలో కుక్కలను పట్టుకువెళ్ళినట్టు సమాచారం. పందులు, కుక్కల బెడదల నుండి నియంత్రించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పిచ్చికుక్కల దాడిలో గాయపడిన చిన్నారులు

సంస్కరణల పేరుతో పట్టణ ప్రజలపై భారాలు

- పట్టణ నివాస ప్రాంతాల రాష్ట్ర కన్వీనర్ సిహెచ్ బాబూరావు

ప్రజాశక్తి-నెల్లూరు

పట్టణ సంస్కరణల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై పెను భారాలు మోపుతోందని పట్టణ నివాస ప్రాంతాల రాష్ట్ర కన్వీనర్ సిహెచ్ బాబూరావు విమర్శించారు. చెత్తపన్ను, ఇంటి పన్ను, విద్యుత్ భారాలు మోపడంతోపాటు మంచినీటి మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నామని తెలిపారు. రాజకీయ పార్టీలకతీతంగా ప్రజలందరూ పాల్గొని ప్రభుత్వ చర్యలను వ్యతిరేకించాలని కోరారు. నెల్లూరులోని డాక్టర్ రామచంద్రారెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆదివారం మీడియాతో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను పీడించి పన్నులు వసూలు చేసే వ్యాపార సంస్థలుగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను మార్చివేసిందని విమర్శించారు. ఈ ఏడాది విద్యుత్తు ఛార్జీలు పెంచి సుమారు రూ.1500 కోట్లు మేరకు ప్రజలపై అధనపు భారం మోపిందన్నారు. 'ట్రూఅప్ ఛార్జీ'ల పేరుతో 36 నెలల్లో సుమారు రూ.2, 900 కోట్లు వసూలు చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే రంగం సిద్ధం చేసిందని తెలిపారు. విద్యుత్ నియంత్రణ మండలిలో ఈ నెల 19, 20, 21 తేదీల్లో విచారణ జరగబోతుందన్నారు. విద్యుత్ సంస్థ ఆదాయం, వ్యయం రెండిటి మధ్య రూ. 13 వేల కోట్ల మేరకు తేడా చూపిస్తోందన్నారు. ప్రతి ఇంటికీ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం టెండర్లు పిలిచిందని, దీనికి రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకూ వినియోగదారునికి ఖర్చవుతుందని తెలిపారు. ఇటు రాష్ట్రం, అటు కేంద్రం రెండు కలిసి అమలు చేస్తున్న విధానాల వల్ల వంటింటి గ్యాస్, పెట్రోల్, డీజల్ ధరలు, వస్తువుల ధరలు మండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ భారాలన్నింటికీ వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలకు సిద్ధమవుతున్నామన్నారు. అందులో భాగంగా ఈ నెల 19, 20, 21 తేదీల్లో రెగ్యులేటరీ కమిషన్ ముందు అభిప్రాయాలు తెలియజేస్తామన్నారు. సమావేశంలో పట్టణ నివాస ప్రాంతాల జిల్లా కన్వీనర్ మాదాల వెంకటేశ్వర్లు, సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ పాల్గొన్నారు.

మిర్చిపై 'నల్లి' దాడి

- కళ్ల ముందే పంట దెబ్బతింటుండడంతో రైతులు కన్నీరుమున్నీరు • దున్నేయడం తప్ప వేరే దారి లేదంటూ ఆవేదన

ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి

మిర్చి పంటపై నల్లి పురుగు దాడి చేస్తుండడంతో రైతులు విలవిలలాడుతున్నారు. చేతికి అందివస్తున్న దశలో పంట కళ్లముందే దెబ్బతినడం చూసి కన్నీరుమున్నీరవుతున్నారు. గతేడాదీ నల్లి పురుగు దాడికి మిర్చి రైతులు తీవ్ర నష్టాలను చూవిచూశాడు. ఈ ఏడాదీ అదే పరిస్థితి నెలకొంది. ఈ పురుగును అదుపు చేసేందుకు మందులు అందుబాటులో లేకపోవడంతో దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు.

ఏలూరు జిల్లాలో దాదాపు ఐదు వేల ఎకరాల్లో రైతులు మిర్చి సాగు చేస్తున్నారు. ఏటా సెప్టెంబర్‌లో సాగును ప్రారంభిస్తారు. మార్చికి పూర్తి స్థాయిలో పంట చేతికొస్తుంది. ప్రస్తుతం పూత దశలో ఉంది. ఈ దశలో నల్లి పురుగు విజృంభనతో పూత మొత్తం రాలిపోతోంది. మొక్కలు కుచించుకుపోతున్నాయి. పురుగు మందులు వాడినా ప్రయోజనం లేకుండా ఉందని రైతులు వాపోతున్నారు. ఎకరా విస్తీర్ణంలో మిర్చి సాగుకు రూ.లక్ష వరకూ పెట్టుబడి అవుతోంది. నల్లి తెగులు సోకడంతో వారానికి రెండు, మూడుసార్లు పురుగుమందులు అదనంగా పిచికారీ చేయాల్సి వస్తోందని, దీనివల్ల అదనంగా రూ.50 వేల వరకూ ఖర్చవుతోందని రైతులు చెప్తున్నారు. పంట సవ్యంగా పండితే ఎకరాకు 25 క్వింటాళ్ల వరకూ దిగుబడి వస్తుంది. నల్లి తెగులుతో రెండు నుంచి మూడు క్వింటాళ్లు దిగుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని వాపోతున్నారు. దీనిపై జిల్లా ఉద్యాన శాఖాధికారి పాండురంగరావును వివరణ కోరేందుకు ఫోన్లో ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

కౌలురైతుల పరిస్థితి అగమ్యగోచరం

మిర్చి సాగు చేసిన కౌలు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఎకరాకు రూ.30 వేలు కౌలు, దాదాపు రూ.లక్షన్నర వరకూ పెట్టుబడి పెట్టారు. నల్లితెగులతో పంట దెబ్బతినడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ రైతు సంఘాల ఆధ్వర్యంలో మిర్చి రైతులు గతేడాది ఆందోళన చేపట్టడంతో ఎట్టకేలకు ప్రభుత్వం ఎకరాకు రూ.19 వేలు పరిహారం అందించింది. భూయజమానులకే పరిహారం అందింది.

వాస్తవ సాగుదారుడైన కౌలు రైతులకు ప్రభుత్వ సాయం అందలేదు. ఈ ఏడాదీ ఇ-క్రాప్‌లో భూయజమానుల పేర్లనే అధికారులు నమోదు చేశారు. ఈసారైనా తమకు న్యాయం చేయాలని కౌలురైతులు కోరుతున్నారు.

నలి తెగులు సోకడంతో ముడుచుకుపోతున్న మిర్చి పైరు

పూత మొత్తం రాలిపోతోంది

రెండెకరాలు కౌలుకు తీసుకుని మిర్చి పంట వేశాను. ఎకరానికి కౌలు కాకుండా లక్షన్నర రూపాయల వరకూ పెట్టుబడి పెట్టాను. నల్లి తెగులు సోకి పూత అంతా రాలిపోతోంది. ఎన్ని పురుగు మందులు చల్లినా ప్రయోజనం లేకుండాపోతోంది. గతేడాదీ ఇదే విధంగా నష్టపోయాం. ఈసారి అదే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం సాయం అందించాలి.

-పామర్తి శ్రీనివాసరావు, వలసపల్లి, ముసునూరు మండలం

పంట దున్నేయడం తప్ప వేరే గత్యంతరం లేదు

70 సెంట్లు కౌలుకు తీసుకుని మిర్చి సాగు చేస్తున్నాను. నల్లి తెగులుతోపాటు, బొబ్బర తెగులు సైతం సోకడంతో పంటంతా దెబ్బతింది. దున్నేయడం తప్ప వేరే గత్యంతరం కనిపించడం లేదు. ప్రభుత్వమే అన్ని విధాలుగా ఆదుకోవాలి.

-యలమందల బాపనయ్య, శోభనాపురం, నూజివీడు మండలం

ఎకరానికి రూ.లక్ష నష్టపరిహారం ఇవ్వాలి

మిర్చి సాగును దెబ్బతీస్తున్న నల్లి తెగులును రాష్ట్ర విపత్తుగా గుర్తించాలి. పంట నష్టపోయిన వారికి ఎకరానికీ రూ.లక్ష చొప్పున పరిహారం అందించాలి. సాగు చేస్తున్న కౌలు రైతుల పేర్లను ఇ-క్రాప్‌లో నమోదు చేయాలి. వారికే నష్టపరిహారం అందించాలి. నూజివీడు సబ్‌డివిజన్ పరిధిలో ఉద్యాన శాఖాధికారిని నియమించి రైతులకు అందుబాటులో ఉండేలా చేయాలి.

-నిమ్మగడ్డ నరసింహ, ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు

రూ.50 వేలు విరాళాన్ని వి శ్రీనివాసరావుకు అందజేస్తున్న గుంటూరు వేమయ్య

సేవా, సాంస్కృతిక కేంద్రాలుగా విజ్ఞాన కేంద్రాలు

- విస్తృత సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు
- పల్నాడు విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ నిర్మాణానికి దాతలు స్పందించాలని పిలుపు

ప్రజాశక్తి - నరసరావుపేట (పల్నాడు జిల్లా)

సేవా, సాంస్కృతిక కేంద్రాలుగా విజ్ఞాన కేంద్రాలు విరాజిల్లేలా నిర్వహణ ఉంటుందనిసిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు అన్నారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో నిర్మించే కేంద్రానికి విరివిగా దాతలు సహకరించాలని కోరారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో కోటప్పకొండ రోడ్డులోని సిపిఎం కార్యాలయంలో విస్తృత సమావేశంలో ఆదివారం ఆయన మాట్లాడారు. జిల్లాలో విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ ఏర్పాటు నిర్ణయం సముచితమని, ఈ ప్రాంతానికి ఉన్న సుదీర్ఘ చరిత్ర నేపథ్యంలో పల్నాడు విజ్ఞాన కేంద్రం ట్రస్ట్‌గా నామకరణం చేసినట్లుగా పేర్కొన్నారు. బ్రహ్మనాయుడు కుల వ్యవస్థను సవాలు చేస్తూ చాప కూడు సిద్ధాతం ప్రవేశపెట్టడం ద్వారా కులాలన్నీ ఒకటే అని చాటి చెప్పిన గడ్డ పల్నాటి గడ్డ అని గుర్తు చేశారు. ఇప్పటికే చాలామంది దాతలు ముందుకు వచ్చి భూరి విరాళాలు ప్రకటించారని విజ్ఞాన కేంద్ర నిర్మాణానికి జిల్లాకు చెందిన పెద్దలతో పాటు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. వెనుకబడిన ఈ ప్రాంత అభివద్ధికి విజ్ఞాన కేంద్రం దోహదం చేస్తుందన్నారు. విజ్ఞాన కేంద్రం అధ్యయనం, సర్వేలు చేసి సమగ్రమైన ప్రణాళికలు రూపొందిస్తుందని తెలిపారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి కృష్ణయ్య మాట్లాడుతూ ఈ కేంద్రం అభ్యుదయ భావజాలాలను పెద్ద ఎత్తున ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు దోహదం చేస్తుందన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎ లక్ష్మేశ్వరరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్, కార్యదర్శివర్గ సభ్యులు వై రాధాకృష్ణ, ఏపూరి గోపాలరావు నాయకులు గద్దె చలమయ్య తదితరులు పాల్గొన్నారు.

భారీగా విరాళాలు

పల్నాడు విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ నిర్మాణానికి సిపిఎం సీనియర్ నాయకులు గద్దె చలమయ్య రూ.20 లక్షలు విరాళం ప్రకటించారు. గద్దె ఉమశ్రీ చిలకలూరిపేట మహిళా కమిటీ తరపున రూ.లక్ష, సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ తండ్రి గుంటూరు వేమయ్య రూ.50 వేలు, మాదల సిపిఎం మాజీ సర్పంచ్ పొట్టి సూర్య ప్రకాషరావు రూ.50వేలు, నాయకులు శ్రీనూనాయక్ రూ.10వేలు విరాళాన్ని వి శ్రీనివాసరావుకు అందజేశారు.

రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించాలి

- కెవిపిఎస్ డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఒంగోలు రీజియన్ పరిధిలో గ్రేడ్-ఎ సూపర్ వైజర్‌పోస్టుల నియామకానికి ప్రకటించిన లిస్టుల్లో వివిధ కేటగిరీలకు ఉన్న రూల్ ఆఫ్ రిజర్వేషన్స్‌ను పాటిస్తూ తిరిగి లిస్టులను ప్రకటించాలని కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓ నల్లప్ప, అండ్ర మాల్యాద్రి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శికి ఆదివారం లేఖ రాశారు.

రాజకీయ రంగంపై దృష్టిపెట్టండి

- ఆర్యవైశ్యుల మహాసభలో డిప్యూటీ స్పీకర్ వీరభద్రస్వామి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

వ్యాపార రంగంలో రాణిస్తున్న ఆర్య వైశ్యులు రాజకీయ రంగంలోనూ రాణించాల్సిన అవసరముందని డిప్యూటీ స్పీకర్ కొలగట్ల వీరభద్రస్వామి అన్నారు. గుంటూరులోని ఎ5 కన్వెన్షన్ సెంటరులో ఆర్యవైశ్య అఫిషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర స్వర్ణోత్సవ వేడుక సభ ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆర్యవైశ్యులు వ్యాపార రంగంతోపాటు విద్యా రంగంలో రాణించాలని, రాజకీయం రంగంలో చురుగ్గా పాల్గొనాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసిందని, ఆర్యవైశ్యుల మనోభావాలను దెబ్బతీసే సన్నివేశాలు ఉన్న చింతమణి నాటకాన్ని రాష్ట్రంలో నిషేదించిందని తెలిపారు. దేవాలయాలు, సత్రాల నిర్వహణను ఆర్యవైశ్యులకు అప్పగించారని అన్నారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు ఎంపి టి.జి.వెంకటేష్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ డిఐజి శ్రీనివాసరావు, జిల్లా రెవెన్యూ అధికారి చంద్రశేఖరరావు, డిప్యూటీ కలెక్టర్ గ్రంధి వెంకటేష్, శ్రీశైలం వాసవీ సత్రాల సమూదాయం చైర్మన్ దేవకి వెంకటేశ్వర్లు, అసోసియేషన్ రాష్ట్ర ఆధ్యక్షులు రాంబాబు, మహిళా అధ్యక్షురాలు నిర్మల తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో ప్రసంగిస్తున్న డిప్యూటీ స్పీకర్

మాట్లాడుతున్న జస్టిస్ దివ్య

గెలుపోటములను సమానంగా పరిగణించాలి

పత్తికొండ జూనియర్ సివిల్ కోర్ట్ జడ్జి జస్టిస్ దివ్య

ప్రజాశక్తి-పత్తికొండ

ఆటలలో గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని పత్తికొండ జూనియర్ సివిల్ కోర్ట్ జడ్జి జస్టిస్ దివ్య, శ్రీరామ హాస్పిటల్ గైనకాలజిస్ట్ కల్పన, పత్తికొండ రూరల్ సిఐ రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం పత్తికొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని జర్నలిస్టు క్రికెట్ టోర్నమెంట్‌ను జడ్జి దివ్య గైనకాలజిస్ట్ కల్పన, రూరల్ సిఐ రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటలు మానసిక ఉల్లాసానికి దోహద పడతాయని పేర్కొన్నారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

ప్రజలను మోసగిస్తున్న ప్రభుత్వం : టిడిపి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిందని పాలనలోనూ నిత్యం ప్రజలను మోసంచేస్తూనే ఉందని టిడిపి కోడుమూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆకెపోగు ప్రభాకర్ అన్నారు. ఆదివారం కర్నూలు మండలం, గార్గేయపురం గ్రామంలో ఇదేమి ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమాన్ని వారు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇంటింటికి వెళ్ళి వైసిపి ప్రజలను మరోసారి మోసం చేసేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ప్రధాన సమస్యలు డ్రెనేజీ, సిసి రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, ఇక్కడ వైసిపి నాయకులు అడ్డంగా ఎర్రమట్టి దోపిడి చేస్తున్నారని, గ్రామ ప్రజలు తెలపారన్నారు. టిడిపి కర్నూలు మండలం కన్వీనర్ బుర్ర వెంకటేష్, పార్లమెంట్ బిసి సెల్ అధ్యక్షులు సత్రం రామకృష్ణుడు, అధికార ప్రతినిధి విజయ్, మైనారిటీ సీనియర్ నాయకులు సాదిక్ అలీ బేగ్, గ్రామ కమిటీ అధ్యక్షులు సోఫిబేగ్, ఉపాధ్యక్షులు గంగారాం ఐటిడిపి సయ్యద్ బాషా ఎస్‌సి సెల్‌భాస్కర్,ప్రసాద్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆకెపోగు ప్రభాకర్

న్యాయబద్ధంగా భూమిని కొనుగోలు చేశాం : బాబుల్ రెడ్డి

ప్రజాశక్తి-పత్తికొండ

భూమిని న్యాయబద్ధంగా కొనుగోలు చేశామని వైసిపి నాయకుడు బాబుల్ రెడ్డి, వైస్ ఎంపిపి బలరాముడు తెలిపారు. పత్రికా విలేకరులతో ఆయన మాట్లాడుతూ పత్తికొండ మండలం చిన్న హుల్తి గ్రామంలో సర్వేనెంబర్ 150/3లో5.05 సెంట్ల భూమిని కడప జిల్లా ఓబులవారిపల్లి మండలం వై కోట గ్రామానికి చెందిన నేటూరి వెంకటసుబ్బమ్మ లేట్ కృష్ణయ్య రికార్డులను పరిశీలించి 2022 సెప్టెంబర్ 24 భూమిని కొనుగోలు చేశామని తెలిపారు. హోసూరు గ్రామానికి చెందిన దళిత నారాయణ కుటుంబ సభ్యులు మాపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని అన్నారు.

ఈ భూమి వివాదంలో స్థానిక ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవికి ఎటువంటి సంబంధం లేదని అన్నారు.

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జోసఫ్ లక్ష్మయ్య

రాష్ట్ర శాప్ లీగ్ షూటింగ్ బాల్ లో రాణించాలి

ప్రజాశక్తి-కర్నూలుస్పోర్ట్స్

కృష్ణాజిల్లా విజయవాడ పట్టణంలో ఈ నెల14న జరగబోయే రాష్ట్రస్థాయి శాప్ లీగ్ షూటింగ్ బాల్ పోటీల కోసం ఆదివారం పట్టణంలోని బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాల (బి.క్యాంపు) క్రీడామైదానంలో నిర్వహించిన జిల్లా శాప్ లీగ్ షూటింగ్ బాల్ జట్ల ఎంపికలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ జోసఫ్ లక్ష్మయ్య క్రీడాకారులను పరిచయం చేసుకొని అనంతరం క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్రస్థాయి పోటీలలో రాణించి జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలన్నారు. క్రీడలు ఆడటం వలన మానసిక ఒత్తిడి తగ్గి ఉత్సాహం పెరుగుతుందన్నారు పరిపూర్ణమైన ఆరోగ్యం కోసం నిత్యం క్రీడలు సాధన చేయాలని తెలిపారు. ఈ జిల్లా ఎంపికల కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ షూటింగ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి పరుశ రాముడు , కర్నూలు జిల్లా షూటింగ్ బాల్ కార్యదర్శి నాగరాజు , కోశాధికారి పరమేశ్వర రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు సుభాన్ బాష, రమ్య, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న బొప్పరాజు

ముఖ ఆధారిత హాజరుతో ఇబ్బంది పెట్టొద్దు

- సిపిఎస్, జిపిఎస్ రెండూ నష్టమే
- ఉద్యోగ అమరావతి జెఎసి చైర్మన్ బొప్పరాజు
- కర్నూలులో ఫిబ్రవరి 5న జరిగే అమరావతి జెఎసి వార్షికోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఉద్యోగులపై ప్రజల్లో వ్యతిరేకత తీసుకొచ్చే విధంగా ఉన్నాయని ఎపి అమరావతి జెఎసి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు విమర్శించారు. ఉద్యోగులు పనిచేయడం లేదంటూ ఫ్లయింగ్ స్క్వాడ్‌ల పేరుతో తనిఖీలు చేయించడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేతనైతే ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కర్నూలు కలెక్టరేట్‌లోని పొదుపు భవన్‌లో ఎపి అమరావతి జెఎసి జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఫిబ్రవరి 5న కర్నూలులో నిర్వహించే అమరావతి జెఎసి రాష్ట్ర మూడవ వార్షికోత్సవ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉద్యోగులు సరిగ్గా పని చేయడంలేదని ప్రభుత్వం భావించడం సరికాదని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలు పేదలకు పూర్తి స్థాయిలో అందుతున్నాయంటే అందుకు ఉద్యోగులే కారణమన్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. ముఖ ఆధారిత హాజరు పేరుతో ఉద్యోగులను ఇబ్బంది పెట్టడం తగదన్నారు. దీనినే ఉద్యోగుల జీతాలకు ముడి పెట్టొద్దని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జిపిఎస్ విధానం ఆమోదయోగ్యం కాదన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సిపిఎస్, జిపిఎస్ రెండూ నష్టదాయకమని తెలిపారు. వెంటనే పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు అవుట్ సోర్సింగు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరారు. వచ్చే నెల ఐదున జరిగే అమరావతి జెఎసి వార్షికోత్సవ సభకు పెద్ద ఎత్తున ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు తరలిరావాలని కోరారు. సమావేశంలో అమరావతి జెఎసి జిల్లా చైర్మన్ గిరికుమార్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు వెంకట్‌రెడ్డి, నాగరమణయ్య మద్దిలేటి పాల్గొన్నారు.

కడమకుంట్లలో ఇదేం కర్మ కార్యక్రమం

ప్రజాశక్తి -తుగ్గలి

మండలం పరిధిలోని కడమకుంట్ల గ్రామంలో ఆదివారం ఇదేమిఖర్మ కార్యక్రమం టిడిపి మండల కమిటీ అధ్యక్షులు తిరుపాలనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్‌పి చైర్మన్ బత్తిన వెంకట రాముడు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నారన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ నిధులన్నిటిని దారి మళ్ళించారన్నారు. అదేవిధంగా గ్రామపంచాయతీ నిధులను కూడా వాడుకోవడం మరీ దారుణమన్నారు. ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి గ్రామపంచాయతీలని నిర్వీర్యం చేస్తున్నారని అన్నారు. ఇలాగే కొనసాగితే గ్రామపంచాయతీ కార్యాలయాలు మూతపడే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి పక్కీరప్ప, బుజ్జులు, బొగ్గుల సుధాకర్, శంకరయ్య, తులసి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కడమకుంట్ల ఇదేంఖర్మ కార్యక్రమంలో టిడిపి నాయకులు బత్తిన

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి -తుగ్గలి

గ్రామాలలో జాబ్ కార్డు ఉన్న ప్రతికూలి ఉపాధి పనులను సద్వినియోగం చేసు కోవాలని ఎపిఒ రామకృష్ణ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామాలలో కూలీలు ఎవరూ వలసలు వెళ్లకుండా ఉండేందుకు అన్ని గ్రామాల్లో జాతీయ ఉపాధి హామీ పథకం పనులను ప్రవేశపెట్టామన్నారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి కూలి తమ గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధి పనులను వినియోగించుకోవాలన్నారు. ఇప్పటికే చాలా గ్రామాలలో జాతీయ ఉపాధి పనులు ప్రారంభించిందన్నారు. అదేవిధంగా జాబ్ కార్డు ఉన్న ప్రతి వ్యక్తి ఆధార్ నెంబరును అనుసంధానం చేయించుకోవాలన్నారు. ఆధార్ నెంబర్ అనుసంధానం లేకపోతే కూలీలు తీవ్ర ఇబ్బందులకు గురి కావాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. అదేవిధంగా గ్రామాల్లో ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్లు, సీనియర్ మీటిలో కూలీల జాబు కార్డుకు ఆధార్‌ను అనుసంధానం చేయాలన్నారు.

సెమినిస్ ఎస్‌విహెచ్ 2222 తేజ మిరపతో లాభదాయకం

ప్రజాశక్తి-సి బెళగల్ : సెమినిస్ ఎస్‌విహెచ్‌ఎ 2222 తేజ మిరప సాగుతో అధికలాభాలు చవిచూడవచ్చని టీరిటరీ మేనేజర్ శ్రీకాంత్ అన్నారు. ఆదివారం మండలంలోనీ గొల్లలదొడ్డిలో చంటెన్న పొలంలో సాగుచేసిన పొలంలో ఆయా గ్రామాల రైతులను సమీక్షించి అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు.

ఎకరాకు లక్షవరకు ఖర్చు వస్తుందని ఎకరాకు సుమారు 40 క్వింటాళ్లు దిగుబడినిస్తుందని అన్నారు. తక్కువ పెట్టుబడితో అధికదిగుబడి, తెగుళ్ల కూడా సోకవని, మార్కెట్‌లో క్వింటం ధర రూ.23000 వేలు పలుకుతుందని, ఈ రకం సాగుపై అవగాహన పెంచుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ఎ.స్వామి, శ్రీనివాసులు, రామచంద్ర, మిరప విత్తన డిస్ట్రిబ్యూటర్లు పరమేశ్వరరెడ్డి, నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

సాఫ్ట్ టెన్నిస్ స్టేట్ జాయింట్ సెక్రటరీగా నవీన్

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్ :

ఆంధ్ర ప్రదేశ్ సాఫ్ట్ టెన్నిస్ ఎన్నికలలో కర్నూలు జిల్లాకు చెందిన శవాల నవీన్‌ను ఆ సంస్థ జనరల్ బాడీ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్ను ఎన్నుకున్నామని సంస్థ రాష్ట్ర కార్యవర్గం పేర్కొంది. విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర సాఫ్ట్ టెన్నిస్ జనరల్ బాడీ , స్టేట్ఎలక్షన్స్‌లో కర్నూలు కార్యదర్శి నవీన్ కుమార్ రెండోసారి రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా కోచ్ కమిటీకి ఎన్నికయ్యారని రాష్ట్ర కార్యవర్గం తెలిపింది. 2022-2026 కొనసాగనున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చైర్మన్ దారం నవీన్, రాష్ట్ర అధ్యక్షులు శీను బాబు వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన కార్యదర్శులు పాల్గొన్నారు.

కాపు ఉద్యోగుల క్యాలెండర్ డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

కాపు ఉద్యోగుల సంక్షేమ సంఘం 2023 క్యాలెండర్ , డైరీ ఆవిష్కరణ ఆదివారం ఆ సంఘ కార్యాలయంలో జరిగింది. రాయల్ కాపు ఉద్యోగుల సంక్షేమ సంఘం స్టేట్ మెంబర్ సెక్రెటరీ కోనేటి చంద్రబాబు, మాజీ అధ్యక్షులు బిఎ శ్రీనివాసరావు, ఆరో కన్‌స్ట్రక్షన్స్ అధినేత శెట్టి విజయ్ కుమార్, రోపా జిల్లా అధ్యక్షులు కొట్టే చెన్నయ్య, ప్రధాన కార్యదర్శి గన్నపరెడ్డి శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా పాల్గొని ఆవిష్కరించారు.

జెసిబితో మట్టిని తవ్వుతున్న దృశ్యం

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరు

- సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్

ప్రజాశక్తి - ఆత్మకూర్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని డాక్టర్ ఏ.ధనుంజయ మీటింగ్ హాల్‌లో సిపిఎం జనరల్ బాడీ సమావేశం పట్టణ కార్యదర్శి ఏ. రణధీర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం యువశక్తిని నిర్వీర్యం చేస్తోందని అన్నారు. ప్రజల ఆస్తులను, ప్రకృతి వనరులను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతుందని విమర్శించారు. అధికారం కోసం ప్రజల మధ్య కుల, మత అడ్డగోడలు నిర్మిస్తుందన్నారు. జిఎస్‌టి పేరుతో ప్రజల నడ్డి విరిచిందని, పెట్రోలు గ్యాస్ ధరలు రెట్టింపు చేసిందన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ప్రధాని మోడీ హామీ ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదన్నారు. రాష్ట్రానికి అన్యాయం చేసిన కేంద్ర ప్రభుత్వంతో రాష్ట్రంలోని అధికార వైసిపి ప్రభుత్వం, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు అంటకాగుతుండడం సిగ్గుచేటన్నారు. విద్యారంగంలో బైజుస్ వంటి సంస్థలతో ఒప్పందాలు కార్పొరేట్ శక్తులను బలోపేతం చేయడానికేనని అన్నారు. ఆర్‌బికెలు రైతులకు భరోసా కల్పించడం లేదని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించే పోరాటాలకు ప్రజలు సిద్ధం కావాలని కోరారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి. యేసురత్నం, మండల కార్యదర్శి నరసింహ నాయక్, నాయకులు సంజీవ రాయుడు, మాభాష, ఎన్.స్వాములు, మంజుల, మీనాక్షమ్మ, ఏ.సురేంద్ర, డి.రామ్ నాయక్, షేక్ ఇస్మాయిల్, సద్దాం, దాసు, చిన్నయ్య, గోపాల్, శివకుమార్, ముర్తుజా, దాసమ్మ, సువర్ణమ్మ, అంబయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డికుంటలో

మట్టి అక్రమ తవ్వకాలు

- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం

ప్రజాశక్తి - జూపాడుబంగ్లా

జూపాడుబంగ్లా మండలం పారుమంచాల పరిధిలోని బుచ్చిరెడ్డికుంటలో అక్రమార్కులు మట్టి తవ్వకాలను యథేచ్ఛగా సాగిస్తున్నారు. బుచ్చిరెడ్డికుంటలో అధికార పార్టీలోని ఓ వర్గానికి చెందిన నాయకుడి అండదండలతో కుంటలో యథేచ్ఛగా మట్టిదోపిడీ కొనసాగుతోంది. మట్టిని కుంట నుంచి ఏకంగా జెసిబిలతో తవ్వి ట్రాక్టర్ మట్టి రూ.800 నుంచి రూ.1000 దాకా విక్రయిస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. ప్రతి రోజు పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నారు. సమన్వయంతో ప్రకృతి సంపదను పరిరక్షించాల్సిన ఇరిగేషన్, రెవెన్యూ, యంత్రాంగం మాత్రం కళ్లకు గంతలు కట్టుకుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రైతులకు ఉపయోగపడాల్సిన మట్టి నేడు వ్యాపారవస్తువుగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మట్టి దోపిడీకి అడ్డుకట్ట వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎవ్వరికీ అనుమతులు ఇవ్వలేదు : తహాశీల్దార్

బుచ్చిరెడ్డికుంటలో మట్టి తరలించేందుకు ఎటువంటి అనుమతులు లేవని, ప్రస్తుతం తాము ఎవరికి అనుమతులివ్వలేదని తహాశీల్దార్ పుల్లయ్య యాదవ్ తెలిపారు. మట్టి అక్రమ తరలింపును అడ్డుకొనేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఎటువంటి అనుమతులు తీసుకోలేదు : మైనర్ ఇరిగేషన్ ఎఇ

బుచ్చిరెడ్డి కుంటలో మట్టిని తరలించేందుకు ఎటువంటి అనుమతి తీసుకోలేదని, ఎవరైనా సరే సహించేది లేదని మైనర్ ఇరిగేషన్ ఏఈ రామ్మోహన్ రెడ్డి అన్నారు. విలేకరులు చెరవాణిలో ఎఇతో మాట్లాడగా ఆయన వారి సిబ్బందిని పంపించి మట్టి దందాను ఆక్షేపించారు.

శ్రీశైల క్షేత్రంలో

12 నుండి సంక్రాంతి బ్రహ్మోత్సవాలు

- దేవస్థానం కార్యనిర్వహణాధికారి లవన్న

మాట్లాడుతున్న ఇఒ లవన్న

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైలం క్షేత్రంలో మకర సంక్రమణాన్ని పురస్కరించుకొని ఈనెల 12 నుండి 18వ తేదీ వరకు సంక్రాంతి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయని దేవస్థానం కార్యనిర్వహణాధికారి లవన్న తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఏడు రోజులపాటు బ్రహ్మోత్సవాలు వైభవంగా జరగనున్నాయని చెప్పారు. సంప్రదాయాన్ని అనుసరించి క్షేత్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లకు సంవత్సరంలో రెండుసార్లు సంక్రాంతి, మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించబడతా యని తెలిపారు. సంక్రాంతి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటి రోజు 12వ తేదీ ఉదయం 9 గంటలకు యాగశాల ప్రవేశం, సాయంత్రం ఐదున్నర గంటలకు అంకురార్పణ, అగ్ని ప్రతిష్టాపన, రాత్రి 7 గంటలకు ధ్వజారోహణ ధ్వజపతాకావిష్కరణ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. 13వ తేదీ నుండి 18వ తేదీ వరకు ప్రతిరోజు వాహన సేవలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని చెప్పారు. 12న ధ్వజారోహణ, 13న భృంగి వాహన సేవ, 14న రావణ వాహన సేవ, 15న నంది వాహన సేవ, స్వామి అమ్మ వార్లకు కళ్యాణోత్సవం, 16న కైలాస వాహన సేవ, 17న పూర్ణాహుతి, త్రిశూల స్నానం, నాగవల్లి ధ్వజావరోహణ, 18న అశ్వవాహన సేవ, పుష్ప ఉత్సవం, శయనోత్సవాలు జరుగుతాయని తెలిపారు.

ఆర్జిత సేవలు నిలుపుదల : సంక్రాంతి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ నెల 12 నుండి 18వ తేదీ వరకు ఆర్జిత, పరోక్ష, ప్రత్యక్ష సేవా కార్యక్రమాలు నిలుపుదల చేసినట్లు ఇఒ తెలిపారు.

సామూహిక భోగి పండ్లు కార్యక్రమం : సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని భోగి పండుగ రోజున ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు సామూహిక భోగి పండ్లు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనదలచిన వారు ఈ నెల 13వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు ప్రచురణ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే ఆలయ మాడవీధుల్లో ఈ నెల 15న ముగ్గుల పోటీలు ఉంటాయని, పాల్గొనదలచిన వారు 14వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ప్రచురణ భాగంలో పేర్లు నమోదు చేసుకోవాల్సిందిగా సూచించారు. 17వ తేదీన వేద శ్రవణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. బ్రహ్మోత్సవాలలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకోవాలని కోరారు.

బకాయిలు మంజూరు చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - నంద్యాల

ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంవత్సరం పైగా పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవు బకాయిలు, 2022 మార్చ్ నుంచి పిఎఫ్, ఏపిజిఎల్ఐ లోన్లు, 2018 జూలై నుంచి డిఏలు, 2022 జనవరి నుంచి రావాల్సిన రెండు విడుతలు డిఏలు వెంటనే మంజూరు చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్. నాగమణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నంద్యాలలోని యుటిఎఫ్ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు పివి ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి నాగమణి మాట్లాడుతూ ఆర్థిక బకాయిలు ఇంత సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న పరిస్థితి గతంలో ఎన్నడూ లేదన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులు తీవ్ర నిరాశ, నిస్పృహలతో వున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బకాయిలు వెంటనే మంజూరు చేయాలని కోరారు. ఆరోగ్య సంబంధ వైద్య ఖర్చుల నిమిత్తం, పిల్లల పెళ్ళిళ్ల తదితర కార్యక్రమాలు, ఇంటి అవసరాలు, గృహ నిర్మాణానికి దాచుకున్న డబ్బు సమయానికి అందక అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించక పోతే పోరాటాలకు వెనుకాడబోమని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమావేశంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.సుధాకర్, జిల్లా సహాధ్యక్షుడు జాకీర్ హుస్సేన్, కార్యదర్శులు సత్య ప్రకాశం, రామ్ మోహన్, బాబా ఫక్రుద్దీన్, నాగ స్వామి నాయక్, కిషోర్, రామ కృష్ణుడు, బాలాజీ రావు, ఆడిట్ కమిటీ సభ్యులు దస్తగిరి, షంషుర్, వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, జిల్లా కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సమావేశం లో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి నాగమణి

ప్రతి ఒక్కరూ విద్య, క్రీడా రంగాల్లో రాణించాలి

- మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

ప్రజాశక్తి - ఆత్మకూర్

ప్రతి ఒక్కరూ విద్య, క్రీడా రంగాల్లో రాణించాలని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఘనంగా శ్రీశైలం నియోజకవర్గస్థాయి బుడ్డా వెంగళ రెడ్డి మెమోరియల్ ట్రోఫీ క్రికెట్ పోటీలు శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే సహకారంతో ప్రారంభం అయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి హాజరై పోటీలను ప్రారంభించారు. అంతకుముందు జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. పోటీలను క్రీడాస్ఫూర్తితో చూడాలన్నారు. గెలుపోటములు సహజమని, గెలుపు కోసం వంద శాతం ప్రయత్నించాలన్నారు. శ్రీశైలం నియోజకవర్గంలో క్రీడాభివృద్ధికి ఎప్పుడూ ముందుంటానని పేర్కొన్నారు. అనంతరం ఆయన టాస్ వేసి ముందుగా బ్యాటింగ్ చేసి క్రీడా కారుల్లో ఉత్సాహం నింపారు. అంతకుముందు క్రీడా వాలంటరీలకు దుస్తులు పంపిణీ చేశారు. క్రీడా పోటీల్లో 24 జట్లు తలపడనున్నాయని, గెలుపొందిన వారికి రూ: 50వేలు, రన్నర్స్‌కు రూ. 25 వేలతో పాటు ప్రతి జట్టుకు మెమొంటోను బహుమతి దాత శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి అందజేస్తారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బన్నూరు రామ లింగారెడ్డి, శివ రామిరెడ్డి, కంచర్ల సురేష్, అన్నారపు శేషరెడ్డి, మల్లేశ్వర రెడ్డి, వేణు గోపాల్, శ్రీధర్ రెడ్డి, అబ్దుల్లాపూరం బాషా, కలాం, రాజా రెడ్డి, తిరుపతయ్య, మల్లికార్జున రెడ్డి, రామ్మూర్తి, నిర్వాహకులు ఎన్ఎస్.మున్నా, హజరత్ అలి, రాఘవ,కరీం, జావిద్ లతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రికెట్ ఆడి పోటీలను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

జాతీయ పోటీలకు కొత్తపల్లి క్రీడాకారుడు

ప్రజాశక్తి - కొత్తపల్లి

జాతీయస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు కొత్తపల్లి క్రీడాకారుడు ఎన్.రవి ఎంపికైనట్లు జిల్లా సాఫ్ట్ బాల్ సంఘం కార్యదర్శి కొమ్మువారి విజయ్ తెలిపారు. ఆదివారం కొత్తపల్లిలో క్రీడాకారుడు ఎన్.రవిని పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు అభినందించారు. ఈ సందర్భంగా కొమ్మువారి విజయ్ మాట్లాడుతూ ఒరిస్సా రాష్ట్రంలోని పూరిలో ఫిబ్రవరి 5 నుంచి 9 వరకు జరిగే 44వ జాతీయ స్థాయి సీనియర్ బాల బాలికల ఛాంపియన్ షిప్ పోటీలకు జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు కె.కల్యాణి, ఎన్.రవి ఎంపిక అయ్యారని చెప్పారు. 2022 జూన్ 30 నుంచి జులైలో శ్రీకాకుళంలో జరిగిన 9 వ రాష్ట్ర స్థాయి సీనియర్ సాఫ్ట్ బాల్ ఛాంపియన్షిప్ పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. జాతీయస్థాయిలోనూ రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అభినందన కార్యక్రమంలో సాఫ్ట్ బాల్ సంఘం అడ్వైజర్ జాకీర్, జిల్లా కార్యదర్శి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా 'అల్ట్రాటెక్' యాజమాన్యం

- సిపిఎం మండలం కార్యదర్శి పి దావీదు

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల



మాట్లాడుతున్న దావీదు

మండలంలో పరిధిలోని అల్ట్రాటెక్ సిమెంట్ పరిశ్రమ యాజమాన్యం ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండాపోయిందని సిపిఎం మండల కార్యదర్శి పి.దావీదు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని అంకిరెడ్డిపల్లి, తుమ్మలపెంట, బందర్ల పల్లె గ్రామాల ప్రజలు అల్ట్రాటెక్ సిమెంట్ పరిశ్రమ నుంచి వచ్చే దుమ్ము ధూళి వాయు కాలుష్యం వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అంటు రోగాలు, శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నారని తెలిపారు. అల్ట్రాటెక్ యాజమాన్యం మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. పరిశ్రమ యాజమాన్యం పద్ధతి మార్చుకోకపోతే ప్రజల ఆగ్రహం చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే చూస్తూ ఊరుకునేది లేదన్నారు.

ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆళ్లగడ్డ నియోజకవర్గ కమిటీ ఎన్నిక

- అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా శ్రీనివాసులు, మల్లికార్జున రెడ్డి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలోని అనంత కళాశాలలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఏపిడబ్ల్యుజెఎఫ్) ఆళ్లగడ్డ నియోజకవర్గ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా నిజాముద్దీన్, అధ్యక్షులుగా శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా నాగయ్య, కేశవ, సుబ్బారావు, ప్రధాన కార్యదర్శిగా మల్లికార్జున రెడ్డి, సహాయ కార్యదర్శులుగా నరసింహులు, గురుశంకర్, భాస్కర్, ట్రెజరర్‌గా నాగరాజు, కార్యవర్గ సభ్యులుగా హనీఫ్, టివిఎస్‌వి ప్రసాద్, భాష, దాసు, మహబూబ్ బాషా, సాగర్ రెడ్డి, మోహన్, జయగోపాల్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గోరంట్లప్ప, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మౌలాలి మాట్లాడారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధులుగా పని చేసే జర్నలిస్టుల సమస్యలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలన్నారు. అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల పట్టాలు ఇచ్చి, పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు వేజ్ బోర్డును అమలు చేయాలని, కనీస వేతనాన్ని కల్పించి, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. జర్నలిస్టుల పిల్లలకు విద్యలో 80 శాతం రాయితీ ఇవ్వాలన్నారు. జర్నలిస్టుల హక్కుల కోసం ఎపి వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ రాజీలేని పోరాటం చేస్తోందన్నారు. అర్హులైన జర్నలిస్టులందరికీ జిఎస్టితో సంబంధం లేకుండా అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజాశక్తి డెస్క్ ఇన్‌ఛార్జి పి.చంద్రయ్య, ఏపిడబ్ల్యూజెఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు మద్దయ్య యాదవ్, కర్నూలు సిటీ కార్యదర్శి నాగేంద్ర, నంద్యాల నియోజకవర్గ అధ్యక్షులు శివ కుమార్, ప్రధాన కార్యదర్శి జగన్, బనగానపల్లె నియోజకవర్గ ఉపాధ్యక్షులు రామచంద్రారెడ్డి, నరసింహారెడ్డి, జవహర్ ,కార్యదర్శి షాషావలితో పాటు వివిధ పత్రికల విలేకరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డిని, మాజీ ఎంపిపి అంబాల రామకృష్ణారెడ్డిలను సన్మానిస్తున్న బీసీ సెల్ నాయకులు

మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డికి సన్మానం

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని టిడిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి, మాజీ ఎంపీపీ అంబాల రామకృష్ణారెడ్డిలను బిసి సెల్ నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా టిడిపి బిసి సెల్ నియోజకవర్గ అధ్యక్షులు పలుకూరు వల్లెపు శంకర్ మాట్లాడుతూ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర అధ్యక్షులు అచ్చం నాయుడు, బిసి సెల్ రాష్ట్ర అధ్యక్షులు మాజీ మంత్రి మాజీ కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డిలు బనగానపల్లె నియోజకవర్గం బిసి సెల్ అధ్యక్షుడిగా తనను నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. టిడిపి పాలనలోనే బిసిల అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు చల్లా మద్దిలేటి, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్పు బాలకృష్ణమ్మ ఆశయ సాధనకు కృషి : ఎపిటిఎఫ్

ప్రజాశక్తి - బనగానపల్లె

ఉద్యమ పితామహుడు, పోరాట యోధుడు ఏపిటిఎఫ్ 1938 వ్యవస్థాపకులు మార్పు బాలకృష్ణమ్మ ఆశయ సాధన కోసం ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని ప్యాఫ్టో జిల్లా చైర్మన్ బి. మాధవస్వామి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని బనగానపల్లె ఏపీటీఎఫ్ డివిజన్ కార్యాలయంలో మార్పు బాలకృష్ణమ్మ 10వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల అనేక సమస్యలకు పరిష్కారం ఉద్యమాల ద్వారానే సాధించిన ఘనత మార్పు గారికి దక్కుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు ఎం.మధుసూదన్ రావు, జిల్లా ఉపాధ్యక్షులు జి. లింగమయ్య, రాష్ట్ర కౌన్సిలర్లు డి .నాగరాజు, వి. సుబ్బారాయుడు, బనగానపల్లె మండలం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జె.వెంకట కృష్ణుడు, ఇ.సుంకన్న, నాయకులు కె. రమేష్ ,పోలియ నాయక్, చాంద్ బాషా, రఫీ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

నేడు స్పందన కార్యక్రమం

నంద్యాల కలెక్టరేట్ : నంద్యాల పట్టణంలోని వైఎస్సార్ సెంటినరీ హాలులో నేడు స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా యథాతథంగా స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తులు

కొలిమిగుండ్ల : మండలంలోని ఆయా గ్రామాలలో అంగన్వాడీ ఆయా 4 పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసిడిఎస్ సూపర్వైజర్ శ్రీవాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడి తుమ్మలపెంట (బీసీ-ఏ), కోరుమాను పల్లె (బీసీ-డి) అబ్దుల్లాపురం (ఓసి), హనుమంత గుండం (బిసి-బి) కేటాయించారని, 7వ తరగతి ఉత్తీర్ణత సాధించి 21 నుంచి 35 సంవత్సరాల లోపు వయస్సు, గ్రామ నివాసిగా, వివాహితులై ఉండాలన్నారు. ఈనెల10వ తేదీలోపు పూర్తి చేసిన దరఖాస్తులను ఓవెలకుంట్ల ఐసిడిఎస్ కార్యాలయంలో అందజేయాలన్నారు.

తెలుగు సాహితీ వికాసంలో

డాక్టర్ కోడూరు ప్రభాకర్ రెడ్డి కృషి విశిష్టమైనది

- దూరదర్శన్ మాజీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఆర్.అనంత పద్మనాభ రావు

ప్రజాశక్తి - నంద్యాల

తెలుగు సాహితీ వికాసంలో డాక్టర్ కోడూరు ప్రభాకర్ రెడ్డి కృషి విశిష్టమైనదని ప్రముఖ సాహితీవేత్త మాజీ దూరదర్శన్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ అర్. అనంత పద్మనాభ రావు తెలిపారు. అజోవిభో కందాళం ఫౌండేషన్, కళారాధన సాంస్కృతిక సంస్థ నంద్యాల సంయుక్త నిర్వహణలో గత మూడు రోజులుగా నంద్యాల మున్సిపల్ టౌన్ హాల్లో జరుగుతున్న రాష్ట్రస్థాయి సాహితీ నాటక ఉత్సవాలలో భాగంగా ఆదివారం ఉదయం ప్రతిభా మూర్తి జీవితకాల సాధన పురస్కారం అందుకోబోతున్న కడపకు చెందిన ప్రముఖ సాహితీవేత్త కోడూరు ప్రభాకర్ రెడ్డి సాహితీ కృషి సమాలోచన సదస్సు నిర్వహించారు. సదస్సులో కోడూరు ప్రభాకర్ రెడ్డి సాహిత్యంపై విశ్లేషించారు. డాక్టర్ కోడూరు ప్రభాకర్ రెడ్డి రచించిన శృంగార తిలకం కావ్యంపై డాక్టర్ దీవి హైయగ్రీవాచారి, బాలసాహిత్యంపై డాక్టర్ తుమ్మలపల్లి వాణికుమారి, రచనలలో ప్రేమ తత్వంపై జొన్నవిత్తుల రామచంద్రమూర్తి, పల్నాటి భారతంపై డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, రేనాటి పలుకుబడులపై డాక్టర్ చింతకుంట శివారెడ్డి, ద్రౌపదిపై డాక్టర్ కురుమేటి కిషోర్ కుమార్ ప్రసంగించారు. సాహితీ జీవితంపై ప్రచురించిన ప్రతిభ వైజయంతి పుస్తకాన్ని ఫౌండేషన్ వ్యవస్థాపకులు అప్పా జోస్యుల సత్యనారాయణ ఆవిష్కరించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు అప్పా జోస్యుల సత్యనారాయణ, కళారాధన ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవి కృష్ణ, కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్ఆర్ ఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అప్పా జోస్యుల సత్యనారాయణ

డాక్టర్ కోడూరు ప్రభాకర్ రెడ్డి కి ప్రతిభా మూర్తి జీవితకాల సాధన పురస్కార ప్రదానం

అజో విభో కందాళం ఫౌండేషన్ తరపున డాక్టర్ కోడూరు ప్రభాకర్ రెడ్డికి మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ ప్రతిభామూర్తి జీవితకాల సాధన పురస్కారం, లక్ష రూపాయల నగదు బహుమతి అందించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మండలి బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ అజో విభో కందాళం ఫౌండేషన్ గత 30 సంవత్సరాలుగా తెలుగు భాష ఉన్నతికి, సాహితీ వికాసానికి చేస్తున్న కృషి చారిత్రాత్మకమన్నారు. కళారాధన నంద్యాలలో కళా వికాసానికి చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు.

నాటు సారా తయారు చేసినా, అమ్మినా కఠిన చర్యలు : ఎస్ఐ

అవుకు : అవుకు మండలంలో నాటు సారా తయారు చేసినా, అమ్మినా కఠిన చర్యలు తప్పవని ఎస్సై జగదీశ్వర్ రెడ్డి హెచ్చరించారు. ఆదివారం మండలంలోని కొండమనాయుని పల్లె గ్రామ పరిసరాల్లో ఉన్న కొండలలో నాటుసారా బట్టీలు ఉన్నాయన్న సమాచారం మేరకు తనిఖీలు చేపట్టారు. ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో నాటు సారా తయారీపై నిరంతరం నిఘా ఉంటుందని తెలిపారు.

ఇదేం కర్మ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

జీవో నెంబర్ 1ని ఉపసంహరించుకోవాలి : టిడిపి

ప్రజాశక్తి - బేతంచెర్ల

ప్రజాస్వామ్యాన్ని కాలరాసే విధంగా వైసిపి ప్రభుత్వం అమలు చేసిన జీవో నెంబర్ 1ని తక్షణమే ఉపసంహరించుకోవాలని టిడిపి డోన్ నియోజకవర్గ ఇన్చార్జి ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి, పట్టణ కార్యదర్శి షేక్షావలి చౌదరి డిమాండ్ చేశారు. తెలుగుదేశం పార్టీ తలపెట్టిన ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం బేతంచెర్ల పట్టణంలోని అంగళ్ళ బజారు, గౌరీపేట కాలనీలలో మండల నాయకులు తిరుమలేష్ చౌదరి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో తుగ్లక్‌ను మించిన పరిపాలన కొనసాగుతుందని, జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం జీవో నెంబర్ 1విడుదల చేయడమే అందుకు నిదర్శనమన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో వైసిపి ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగేశ్వర్ రెడ్డి, రమేష్ రెడ్డి, భీమారెడ్డి, కానాల అంజి, రామ్మూర్తి, రామకృష్ణ, రాముడు, శివ, మద్దిలేటి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయినిలకు ఘనంగా సన్మానం

ప్రజాశక్తి - నంద్యాల

ఆధునిక భారత తొలి ముస్లిం ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ స్ఫూర్తిగా ఆమె 192వ జన్మదినం పురస్కరించుకుని జమాఅతె ఇస్లామీ, మహిళా విభాగం ఆధ్వర్యంలో ఆదివారం ముగ్గురు మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. నంద్యాల చాంద్ బాడాలోని జమాత్ కార్యాలయంలో మహిళా విభాగం కన్వీనర్ బేగం అమ్తుస్సలామ్ అధ్యక్షతన అమ్తుస్సలామ్ మాట్లాడారు. జమాఅతె ఇస్లామి గత 75 వసంతాలుగా దేశంలో మత సామరస్యానికి, దేశ వాసుల మధ్య ఐక్యత కోసం పలు విధాలుగా శ్రమిస్తు విద్యాభివృద్ధికి, మహిళాభ్యున్నోతికి యనలేని కృషి చేస్తుందన్నారు. అనంతరం ఫాతిమా షేక్ స్ఫూర్తిగా ముగ్గురు మహిళా ఉపాధ్యాయులు నూర్జహాన్, నజీరున్నిసా, హిల్డా సిసిలియాలను శాలువా కప్పి, మెమెంటోతో ఘనంగా సన్మానించారు. ఫిర్దోస్ బాను, ఫాతిమా షేక్ జీవిత విశేషాలు, విద్యా ఆవశ్యకత వివరించారు.

13న వడ్డేమాన్‌లో ముగ్గుల పోటీలు

.ప్రజాశక్తి - నందికొట్కూరు

నందికొట్కూరు మండలం అల్లూరు, కొనేటమ్మ పల్లె, వడ్డేమాన్ గ్రామీణ మహిళలకు ఏఐఎఫ్ నేషనల్ చారిటీ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 13న సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ వ్యవస్థాపకులు కె.రాజేశ్వరి దేవి, చైర్మన్ జి.నాగముని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముగ్గుల పోటీలలో పాల్గొనే మహిళలు రూ.20లు ఎంట్రీ ఫిజ్ చెల్లించి ముందుగానే పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

నేడు ఓంకారంలో అంగళ్లకు వేలం పాట

బండి ఆత్మకూర్

ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఓంకార సిద్దేశ్వర స్వామి ఆలయంలోని పరిసరాలలో వ్యాపార అంగళ్లు పెట్టుకునేందుకు నేడు వేలంపాటలు నిర్వహిస్తున్నట్లు ఈవో మోహన్, ఆలయ చైర్మన్ ఏ విశ్వనాథరెడ్డి తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ ఆలయ పరిసరాల్లో ఐస్ క్రీమ్ బండ్లు, పాదరక్షలు, టెంకాయ, పూజా సామాగ్రి తదితర వస్తువులను అమ్ముకునేందుకు వేలం పాటలు నిర్వహిస్తున్నామన్నారు. వేలంలో పాల్గొనేవారు రూ. 10 వేలు డిపాజిట్ చెల్లించాలని, అనివార్య కారణాలు ఏర్పడితే వేలంపాట రద్దు చేయవచ్చని తెలిపారు. వేలంపాట ధరలు ఒక సంవత్సరం కాలం పరిమితి ఉంటుందని పేర్కొన్నారు.

పట్టుబడిన వాహనాలకు 10న వేలం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఆళ్లగడ్డ సబ్ డివిజన్ పరిధిలో పలు మద్యం (ఎక్సైజ్,సారాయి) కేసులలో పట్టుబడిన వాహనాలకు ఆళ్లగడ్డ రూరల్ పోలీసు స్టేషన్‌లో ఈనెల 10న వేలం పాట వెయ్యనున్నట్లు డిఎస్‌పి సుధాకర్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ వేలంపాటలో వాహనం దక్కించుకున్న వారు వేలం పాట డబ్బుతో జిఎస్‌టి కూడా చెల్లించాల్సి ఉంటుందన్నారు. బైకులు 22, ఆటోలు 2, కార్లు 2 వేలం వేయనున్నట్లు తెలిపారు. ఆధార్ కార్డు, పాన్ కార్డ్ వున్నవారు మాత్రమే వేలం పాటలో పాల్గొనటానికి అర్హులన్నారు. ఇతర వివరాలకు డిఎస్‌పి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

యువశక్తి పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - నందికొట్కూరు

నందికొట్కూరులోని జనసేన పార్టీ కార్యాలయంలో యువశక్తి పోస్టర్‌ను ఆ పార్టీ నాయకులు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు రామన్న మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ ఇవ్వడం చేతకాక అప్పుల క్యాలెండర్ ఇచ్చిందని ఎద్దేవా చేశారు. ఈ నెల 12న శ్రీకాకుళంలో జరిగే యువశక్తి భారీ బహిరంగ సభకు యువతీ యువకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

అంబేద్కర్‌ను అవమానించిన వారిని శిక్షించాలి : బిఎస్‌పి, సిపిఐ

నందికొట్కూరు : అంబేద్కర్‌ను అవమానపరిచిన రాయలసీమ యూనివర్శిటీ సూపరింటెండెంట్ ఎండి ఇస్మాయిల్‌పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ నమోదు చేసి కఠినంగా శిక్షించాలని బిఎస్‌పి నాయకులు లాజరు, స్వాములు, సిపిఐ నాయకులు రమేష్ బాబు, రఘురాంమూర్తి డిమాండ్ చేశారు. ఆదివారం నందికొట్కూరు పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్నతమైన హోదాలో ఉండి మద్యం మత్తులో తన తోటి విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావుతో అంబేద్కర్‌ను, దళితులను కించపరిచి మాట్లాడడం తగదన్నారు. ఎండి ఇస్మాయిల్‌ను, శ్రీనివాసరావును తక్షణమే ఉద్యోగం నుండి తొలగించి, అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాద్, పుల్లయ్య, చిన్న రత్నం, దావీదు, జాన్, రాజేష్, శ్రీను, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేరుస్తామని ఎప్పుడైనా ప్రకటన రావచ్చు

- వాల్మీకి పోరాట సమితి జిల్లా అధ్యక్షులు గోవిందు నాయుడు

కొలిమిగుండ్ల : వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేరుస్తామని ఎప్పుడైనా ప్రకటన రావచ్చుని వాల్మీకి పోరాట సమితి నంద్యాల జిల్లా అధ్యక్షులు గోవిందు నాయుడు పేర్కొన్నారు. ఆదివారం కొలిమిగుండ్లలోని సాయి ఫంక్షన్ హాల్‌లో సంఘం అధ్యక్షునిగా కొలిమిగుండ్ల ఉలవల నరసింహుడు ప్రమాణ స్వీకారం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా జిల్లా అధ్యక్షులు గోవింద నాయుడు, మాజీ మండలాధ్యక్షుడు టిసి వెంకటరాముడు, నాయకులు మాజీ సర్పంచి సీతారామయ్య, మాజీ ఎంపిటిసి చంద్రశేఖర్, డాక్టర్ కిరణ్ కుమార్, రామకృష్ణా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు మెడగట్టు రామాంజనేయులు, గొరివిమానిపల్లె సర్పంచ్ రామాంజనేయులు, ఎంకె నాయుడు, కంబగిరి రాముడు, జడలమ్మ గారి మాజీ సర్పంచ్ నాగరాజు, వెంకటేష్, రంగన్న, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

నంద్యాలతో మా అనుబంధాన్ని ఎవరూ విడదీయలేరు

- నంద్యాలను అభివృద్ధి చేసిన ఘనత భూమా నాగిరెడ్డిదే
- మాజీమంత్రి అఖిల ప్రియ, యువనేత జగత్
- భూమా అఖిలప్రియకు పోలీసులకు మధ్య వాగ్వివాదం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాలతో మా అనుబంధాన్ని ఎవరూ విడదీయలేరని, నంద్యాలను అభివృద్ధి చేసిన ఘనత భూమా నాగిరెడ్డిదే అని మాజీ మంత్రి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి భూమా అఖిలప్రియ, యువనేత భూమా జగత్ విఖ్యాత్ రెడ్డిలు పేర్కొన్నారు. దివంగత నేత భూమ నాగిరెడ్డి జయంతి సందర్భంగా బొమ్మలసత్రం నుంచి బైకు ర్యాలీగా బయలుదేరి పద్మావతినగర్‌లోని భూమా నాగిరెడ్డి స్థలం వద్దకు చేరుకొని అభిమానుల మధ్య కేక్ కట్ చేశారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. భూమా అఖిలప్రియ, భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి స్వయంగా రక్తదానం చేశారు. అనంతరం తోపుడుబండ్ల వ్యాపారం చేసుకునే వారికి ఉచితంగా తోపుడు బండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి వచ్చిన నాయకులు,

అఖిలప్రియ, జగత్ విఖ్యాత్‌రెడ్డిలకు స్వాగతం పలుకుతున్న నాయకులు

కార్యకర్తలకు భోజనాలు ఏర్పాటు చేసి భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి, భార్గవ్ రామ్‌లు వడ్డించారు. అనంతరం భూమా విఖ్యాత్ రెడ్డి, అఖిలప్రియలు మాట్లాడుతూ అప్పట్లో పదివేల ఇల్లు కట్టిస్తానంటే ఎద్దేవా చేసిన వారే నేడు ఇళ్లను పంపిణీ చేస్తున్నారని తెలిపారు. నంద్యాలలో నాగిరెడ్డి చేసిన అభివృద్ధి కార్యక్రమాలే నిలిచాయని, పదివేల ఇల్లు, రోడ్ల వెడల్పు, అమృత్ స్కీం కింద నీటి సరఫరా తదితర అభివృద్ధి పనులు చేసిన ఘనత భూమా నాగిరెడ్డికే దక్కుతుందని, ఆయన వారసురాలుగా తాను, జగత్ విఖ్యాత్ రెడ్డి నంద్యాల కార్యకర్తలకు, నాయకులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామన్నారు. తాము ఇక్కడే ఇల్లు నిర్మిస్తున్నామని, ఇక్కడే నివాసముంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పోలీసులతో స్వల్ప వాగ్వివాదం

నంద్యాల బొమ్మలసత్రం నుండి పద్మావతి నగర్ వరకు ర్యాలీ నిర్వహించేందుకు భూమా అభిమానులు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు భూమా అఖిలప్రియకు స్వల్ప వాగ్వివాదం జరిగింది.

బాబాయ్ ఆశయ సాధనకు కృషి చేస్తా : భూమా బ్రహ్మానందరెడ్డి

నంద్యాల పట్టణాన్ని బాబాయ్ ఎంతో అభివృద్ధి చేశారని, ఆయన ఆశయ సాధనకు కృషి చేస్తానని, అభిమానులకు, కార్యకర్తలకు అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి అన్నారు. దివంగత ఎమ్మెల్యే భూమా నాగిరెడ్డి 59వ జయంతి వేడుకలను పట్టణంలోని తులసివనంలో మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు రక్తదాన శిబిరంలో రక్తదానం చేశారు. టిడిపి నాయకులు, కౌన్సిలర్లు, వేలాదిమంది కార్యకర్తలు, నేతలు, మాజీ కౌన్సిలర్లు, పాల్గొన్నారు,

కృష్ణా నదిపై బ్రిడ్జి, బ్యారేజీ నిర్మించాలి

- 28న 'చలో సిద్దేశ్వరం సంగమేశ్వరం
-మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర రెడ్డి

ప్రజాశక్తి - నందికొట్కూరు

కొత్తపల్లి మండలంలోని సంగమేశ్వరం వద్ద సోమశిల-సిద్దేశ్వరం మధ్య కృష్ణా నదిపై రూ.1,200 కోట్లతో నిర్మిస్తున్న ఐకానిక్ బ్రిడ్జికి బదులు బ్రిడ్జి కమ్ బ్యారేజీ నిర్మించాలని రాయలసీమ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం నందికొట్కూరులోని ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 28న చేపట్టే 'చలో సిద్దేశ్వరం సంగమేశ్వరం' కార్యక్రమంలో పాల్గొనాలని నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పార్టీలు, సామాజిక సంఘాలను కోరారు. రాయలసీమ దశాబ్దాలుగా అభివృద్ధి చెందకపోవడానికి వరుసగా వచ్చిన ప్రభుత్వాల సుదీర్ఘ ద్రోహమే కారణమన్నారు. రాయలసీమ గుండా అనేక నదులు ప్రవహిస్తున్నప్పటికీ, ఈ ప్రాంతం కొంతకాలంగా మంజూరు చేయబడిన చిన్న ప్రాజెక్టులతో సంతృప్తి చెందాల్సి వచ్చిందన్నారు. సోమశిల, సిద్దేశ్వరం మధ్య కృష్ణా నదిపై ఐకాన్ వంతెన నిర్మాణం వలన ఎవరికీ లాభం లేదన్నారు. అందాల ఐకాన్ బ్రిడ్జి వద్దు, సీమ సాగు, తాగునీటి కష్టాలు తీర్చే బ్యారేజ్ కమ్ బ్రిడ్జి కావాలని సంక్రాంతి తరువాత వైసిపి నేతల చేతుల్లో మరోసారి మోసపోకుండా సీమ జిల్లాల ప్రజల్లో చైతన్యం తీసుకొస్తామని తెలిపారు. దీని కోసం స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని ప్రకటించారు. రాయలసీమ కరువు శాశ్వత నివారణకు కృష్ణ, తుంగభద్ర నదుల నీరు కీలకమన్నారు. ఈ రెండు నదులు కలిచేచోటు సంగమేశ్వర సమీపంలో సిద్దేశ్వరం అన్నారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారుల నిర్మాణంలో భాగంగా 167 కె జాతీయ రహదారిని అటు తెలంగాణ, ఇటు ఆంధ్రప్రదేశ్‌ను కలుపుతూ సిద్దేశ్వరం సంగమేశ్వరం వద్ద తీగల వంతెన(ఐకాన్ బ్రిడ్జి) చేపడుతుందన్నారు. తీగల వంతెన(ఐకాన్ బ్రిడ్జి)బదులు బ్యారేజ్ తోపాటు వంతెనను చేపట్టితే సుమారు 70 టిఎంసిల నీరు నిలిచి అటు తెలంగాణకు, ఇటు రాయలసీమకు సాగు, తాగు నీరు అందుతుందన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో కెసి కాలువ, ముచ్చుమర్రి ఎత్తిపోతల, హంద్రీనీవా , పోతిరెడ్డిపాడు ప్రాజెక్టులకు సమృద్ధిగా సాగునీరు అందుతుందన్నారు. సమావేశంలో మాజీ జడ్పీటిసి నాగేశ్వరరావు, బిజెవైఎం నందికొట్కూరు ఇంచార్జి నాగ మద్దిలేటి, బిజెపి పట్టణ అధ్యక్షుడు గూడూరు రవికుమార్ రెడ్డి, జూపాడుబంగ్లా నాయకులు రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బైరెడ్డి రాజశేఖర రెడ్డి

మాట్లాడుతున్న నాయకులు నాగరాజు

విఆర్‌ఎలకు వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

- సిఐటియు జిల్లా కార్యదర్శి నాగరాజు

నంద్యాల : విఆర్‌ఎలకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని సిఐటియు జిల్లా కార్యదర్శి నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జరిగిన విఆర్‌ఎల సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ విధుల్లో ఉన్న విఆర్‌ఎలు చనిపోతే వారి కుటుంబంలోని వారికి వారసత్వ హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. విఆర్‌ఏలకు వీఆర్వో ప్రమోషన్ ఇవ్వాలన్నారు. ఈ డిమాండ్లు నెరవేర్చకపోతే పెద్ద ఎత్తున పోరాటాలకైనా సిద్ధమవుతామని తెలిపారు. సమావేశంలో గౌరవాధ్యక్షులు సత్యరాజు, జిల్లా అధ్యక్షులు నాగేష్, కార్యదర్శి భూపాల్, మహేష్, రమాదేవి, వీరన్న, నారాయణ, రంగస్వామి, దామోదర్, ముత్తు మహేశ్వరమ్మ, అన్సర్ పాల్గొన్నారు.

గ్రంథాలయాలను వినియోగించుకోవాలి

కొత్తపల్లి : మండలంలోని విద్యార్థులందరూ గ్రంథాలయాలను వినియోగించుకోవాలని గ్రంథాలయ అధికారి కౌసల్య తెలిపారు. ఆదివారం కొత్తపల్లిలోని గ్రంథాలయంలో విద్యార్థులతో చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాల్లో ఉన్న పుస్తకాలు, పేపర్లు, ప్రముఖుల జీవిత చరిత్రలు చదివి తెలుసుకోవాలని విద్యార్థులకు సూచించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

బనగానపల్లె : పట్టణంలోని ఎస్‌వి డిగ్రీ, జూనియర్ కళాశాలలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు 'యువతకు స్వామి వివేకానంద సందేశం' అంశంపై వ్యాసరచన పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గురుజీ రామశేసయ్య మాట్లాడుతూ శ్రీహట్టి మునిస్వామి దేవస్థానం ప్రాంగణంలో వివేకానంద స్వామి జయంతి సందర్భంగా విద్యార్థులకు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా సలహాదారుడు దొంత వెంకటేశ్వర్లు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు గుద్దేటి సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం : బిసి ఇందిరా రెడ్డి

ప్రజాశక్తి - కోవెలకుంట్ల

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి సతీమణి బిసి ఇందిరా రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని రేవనూరు గ్రామంలో వెలిసిన హుస్సేన్ వలి దర్గాలో కొలిమిగుండ్ల మండలం తుమ్మలపెంట గ్రామానికి చెందిన బాయికాటి బ్రదర్స్ హుస్సేన్ వలి కుమారుడి కేశఖండన కార్యక్రమానికి ఆమె పాల్గొని పిల్లలను ఆశీర్వదించారు. కార్యక్రమంలో మండల, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

కేశఖండన మహోత్సవంలో పాల్గొన్న బిసి ఇందిరా రెడ్డి

బ్రాహ్మణ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి- నంద్యాల రూరల్

నంద్యాలలోని ప్రథమ నంది గాయత్రి దేవాలయంలో బ్రాహ్మణ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 35 మంది మహిళలు పోటీలో పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలుగా సీతాకుమారి, రామ్ ప్రసాద్‌లు వ్యవహరించి పది మందిని విజేతలను నిర్ణయించారు. బ్రాహ్మణ సమాఖ్య సంఘం ప్రధాన కార్యదర్శి నగర దోనా సుధీర్, నాగేంద్ర, కేశవమూర్తి, హెల్త్ సత్యనారాయణ, రేణుక, సాయి, ప్రశాంతి, శ్రీధర్, వసంధర, మల్లిక తదితరులు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రోత్సాహక బహుమతి అందజేశారు.

విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన బ్రాహ్మణ సంఘం నాయకులు

42 ఏళ్లకు కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో 1978-80 ఇంటర్మీడియట్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం బివి సుబ్బారెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థులు సకుటుంబ సమ్మేళనాన్ని నిర్వహించుకొని పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. 42 ఏళ్ల ఇంటర్ విద్య తర్వాత వివిధ పై చదువుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వీరంతా బివి.సుబ్బారెడ్డి ఫంక్షన్ హాల్లో కలుసుకుని సంతోషాన్ని పంచుకొన్నారు. అప్పటి ఫిజిక్స్ లెక్చరర్ ఆంజనేయులును ఘనంగా సన్మానించారు. లాయర్ టి.మాధవ రెడ్డి అధ్యక్షతన అపూర్వ సమ్మేళనాన్ని ఆంజనేయులు జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశం నిర్వహించారు. అనంతరం నూతన కమిటీ అధ్యక్షులుగా మాధవ రెడ్డి, సెక్రటరీగా ఈవి.రమణ, ట్రెజరర్‌గా అక్బర్ బాషా, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎస్.టి.నాగరాజు, గౌరవ అధ్యక్షులుగా కె.హరినాథ్ రెడ్డి, భూమా తులసీశ్వర రెడ్డిలను ఎన్నుకున్నారు. మిగతా కార్యవర్గాన్ని త్వరలో పూర్తి చేస్తామని అధ్యక్షులు మాధవ రెడ్డి తెలియజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల హరినాథ రెడ్డి, ఈ.వి. రమణ, అక్బర్ బాషా, ఎస్టీ నాగరాజు, రాజశేఖర్, వేణుగోపాల్, యూసఫ్ హుస్సేన్, భూమా తులసీశ్వర రెడ్డి, సుమారు 300 మంది పూర్వ విద్యార్థు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని ప్రజా సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తున్నామని శాసనసభ్యులు గంగుల బ్రిజేంద్ర రెడ్డి అన్నారు. ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీలోని 9వ సచివాలయంలో విజయ మిల్క్ డైరీ చైర్మన్ ఎస్‌వి జగన్ మోహన్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం నుండి అందిన సంక్షేమ పథకాల లబ్ధిని లబ్ధిదారులకు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు, కౌన్సిలర్ గొట్లూరు సుధాకర్ రెడ్డి, వైసిపి నాయకులు భాస్కర్ రెడ్డి, గోపాల్ రెడ్డి, చక్రవర్తి, రఘు, సచివాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల నుండి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గంగుల

ఎన్‌టిఆర్ అభిమానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - బనగానపల్లె

భానుముక్కలకు చెందిన ఎన్టీఆర్ అభిమాని ఉస్మాన్‌కు బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచి బి.సి.రాజారెడ్డి ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. ఎన్‌టిఆర్ అభిమాని, టిడిపి కార్యకర్తగా ఉన్న ఉస్మాన్ కాలుకు దెబ్బ తగిలి గత కొంత కాలంగా కూలి పనులకు సైతం వెళ్లలేక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి ఆర్థిక సాయం అందించి, కొత్త దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బిసి రాజారెడ్డి మాట్లాడుతూ ఉస్మాన్ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి ముస్లిం మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు రాయలసీమ సలాం, నాయకులు షబ్బీర్, హర్షద్, విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

తిరుణాలకు సిద్ధమవుతున్న ఆలయాలు

ప్రజాశక్తి - పగిడ్యాల

మండలంలోని పాతకోట గ్రామంలోని ఆలయాలను సంక్రాంతి పండగను పురస్కరించుకుని తిరుణాల నిర్వహణకు ఆలయాల కమిటీ సభ్యులు ముస్తాబు చేస్తున్నారు. పడమర ప్రాతకోట గ్రామంలోని అన్నపూర్ణ కాశీవిశ్వేశ్వర స్వామి, నందేశ్వర స్వామి వార్ల అలయాలను సిద్ధం చేస్తున్నారు. ఆలయాలను నీటితో శుభ్రం చేసి రంగులు వేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. రథోత్సవానికి రథాని సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ నెల 13న బండి సేవ, 14న ప్రభ,15న రథోత్సవం,16న పారువేట, 17 వసంతోత్సంతో తిరుణాల ముగుస్తుందని కమిటీ సభ్యులు తెలిపారు.

ఆలయాన్ని నీటితో శుభ్రం చేస్తున్న దృశం

ఫిబ్రవరి 26న ఉచిత సామూహిక వివాహాలు

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల అంజుమన్ ఆధ్వర్యంలో పేద ముస్లిం యువతులకు ఉచిత సామూహిక వివాహం నిర్వహించి రు.40 వేలు ఇస్తున్న విషయం విదితమే. ఈ నేపధ్యంలో ఫిబ్రవరి 26వ తేదిన అంజుమన్ షాదిఖానాలో ఉచిత సామూహిక వివాహాలు నిర్వహిస్తున్నట్లు అంజుమన్ అధ్యక్షులు నశ్యం అబ్దుల్ ఖుద్దూస్ ఆదివారం తెలిపారు. ఫిబ్రవరి 18 నాటికి ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా గల అంజుమన్ షాదిఖానాలో ధరఖాస్తులు తీసుకొని పూర్తి చేసి, వధూవరుల ఆధార్, ఫోటోలు జత చేసి ఇవ్వాలన్నారు. వధువు నంద్యాలకు చెంది 18 ఏండ్లు నిండి ఉండాలని, వివాహం రోజే రూ.40 వేలు నగదు చెక్కు ఇవ్వనున్నట్లు తెలిపారు. అంజుమన్ నియమానుసారంగా సాముహిక వివాహాలకు సిద్ధమైన పేద ముస్లింలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు అబ్దుల్ హాఖ్, ఏగ్బాల్, హిదాయతుల్లా, మున్నా తదితరులు పాల్గొన్నారు.

బాధిత మహిళను పరామర్శించిన మాజీ సర్పంచి బిసి

ప్రజాశక్తి - బనగానపల్లె

పాము కాటుతో అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న అవుకు మండలం చెన్నంపల్లె గ్రామానికి చెందిన బసిరెడ్డి గారి మధుసూదనరెడ్డి సతీమణి శ్రీలేఖను బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచి బిపి రాజారెడ్డి ఆదివారం కర్నూలులోని సహస్ర ఆస్పత్రిలో పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

శ్రీలేఖను పరామర్శిస్తున్న మాజీ సర్పంచ్ బీసీ రాజా రెడ్డి

మహారాజ శ్రీ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు :
నందికొట్కూరు
O.S.No. 189/2021

బిట్వీన్ :
యస్.తేజేశ్వరప్ప తండ్రి లేటు యస్.మల్లేశ్వర ప్రసాద్, హిందువు, వయస్సు 40 సం॥, ల్యాండ్ లార్డ్, 19-40, సంగయ్య పేట, నందికొట్కూరు, నంద్యాల జిల్లా. ...ప్లెయింటిఫ్

వర్సెస్

బోయ వెంకటేశ్వర్లు తండ్రి పుల్లన్న, హిందువు, వయస్సు సుమారు 55 సం॥, కార్పెంటర్ వ్యాపారం, 22-222, వాల్మీకి నగరు, నందికొట్కూరు, నంద్యాల జిల్లా. ...డిఫెండెంట్

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు ఎన్నిమార్లు ద్వావా సమన్లు పంపించియున్నను సమన్లు అమలు జరగనందున శ్రీ కోర్టు వారు పై దావాలో ప్రతివాదికి సమన్లు అమలు జరపుటకు గాను పత్రికా ముఖముగా ప్రచురణ చేయుట ద్వారా సమన్లు అమలు జరుపవలెనని ఆదేశించియున్నారు. కావున పై దావాలో ప్రతివాదికి సమన్లు అమలు జరుపుటకు శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు ఈ పత్రికా ప్రచురణ జరిగినది. పై ప్రతివాది అయిన మీరు శ్రీ కోర్టు వారి ముందు హాజరు అవుటకు 07-02-2023వ తేదికి వాయిదా వేసియున్నారు. కావున పై తేదిన శ్రీ కోర్టుకు స్వయముగా గాని లేక న్యాయవాది ద్వారా గాని హాజరై తమ ఆక్షేపణలు తెలియజేసుకొనగలరు. లేని యెడల తమ పరోక్షమందు తీర్మానముచేయబడునని తెలియజేడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది : 07-02-2023

టి.రఘునాథ రెడ్డి,
న్యాయవాది,

ఘనంగా భూమా నాగిరెడ్డి జయంతి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలో దివంగత ఎమ్మెల్యే భూమా నాగిరెడ్డి 59వ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక శోభ ఘాట్‌లో భూమా నాగిరెడ్డి సమాధి వద్ద ఆయన చిత్రపటానికి మాజీ మంత్రి భూమా అఖిలప్రియ, భార్గవరామ్ దంపతులు, తాలుకా యువ నాయకులు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డిలు నివాళు లర్పించారు. అలాగే నంద్యాల మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి, బిజెపి తాలుకా బాధ్యులు భూమా కిషోర్ రెడ్డి నివాళులర్పించారు. వారితో పాటు కౌన్సిలర్ హుస్సేన్ భాష, టిడిపి నంద్యాల పార్లమెంటు అధికార ప్రతినిధి బంగారు రాము యాదవ్, మాజీ జెడ్పిటిసి చాంద్ బాషా, కాంట్రాక్టర్ నన్నేబాయ్ గారి జిలాన్, బ్యాంకు బాలిరెడ్డి, భూమా అభిమానులు నివాళులర్పించారు. **చాగలమర్రి :** దివంగత ఎమ్మెల్యే భూమా నాగిరెడ్డి తన జీవితం ప్రజాసేవకే అంకితం చేశారని రాష్ట్ర టిడిపి మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు ముల్లా అన్సర్‌బాష అన్నారు. చాగలమర్రిలోని మహబూబ్ థియేటర్ ఆవరణంలో భూమా నాగిరెడ్డి జయంతి సందర్భంగా భూమా చిత్రపటానికి పూలమాల వేసి, కేక్ కట్ చేసి ఘనంగా నివాళులు అర్పించారు. టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి గుత్తి నర్సింహులు, నంద్యాల పార్లమెంటరీ బిసి సెల్ స్పోక్ పర్సన్ సల్లా నాగరాజు,నంద్యాల పార్లమెంటరీ మైనార్టి నాయకులు కొలిమి హుసేన్‌వళి, షరీఫ్, ఐ టిడిపి నియోజకవర్గ ఉపాధ్యక్షురాలు శగ్నారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి హనీఫ్, ప్రచార కార్యదర్శి గఫార్, మౌళాలి, జోషఫ్, ఓబులేసు, రమేష్, భాస్కర్ రెడ్డి, నాగశేషు, గాంధీ, శ్యాబుల్, రాజేష్, బషీర్, మాబులాల్, సోను, బషీర్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు. **ఉయ్యాలవాడ :** మండలంలోని పడియపాడు గ్రామంలో టిడిపి మండల నాయకుడు కూడా నారాయణరెడ్డి స్వగృహంలో భూమా నాగిరెడ్డి 59వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమా నాగిరెడ్డి రైతు బాంధవుడని, రైతుల కోసం ఎన్నో త్యాగాలు చేశారని తెలిపారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. టిడిపి నాయకులు, వైస్ సర్పంచ్ దస్తగిరి పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ : భూమా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

చాగలమర్రి : కేక్ కట్ చేస్తున్న టిడిపి నాయకులు